ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ మున్ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

# SUPHALA AKSHARAM


THURSDAY 02ND JULY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 106 COST : 3\- KHAMMAM, TELANGANA

గురువారం 02 జూలై 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 106 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌కు బ్రేక్

- మెటాకు కేంద్రం నోటీసులు..వివరాలు ఇవ్వాలని ఆదేశం




## హిందూ వివాహంలో రిజిస్ట్రేషన్ మాత్రమే సరిపోదు

### ఆచారాలు అవసరం: గుజరాత్ హైకోర్టు



అహ్మదాబాద్(గుజరాత్)జూలై, 1 (అక్షరం న్యూస్): హిందూ వివాహ వ్యవస్థ విశిష్టతపై గుజరాత్ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. హిందూ సంప్రదాయాల ప్రకారం 'సప్తపది' (ఏడడుగులు) వంటి శాస్త్రోక్తమైన క్రతువులు, ఆచారాలు నిర్వహించకుండా కేవలం మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందినంత మాత్రాన ఆ పెళ్లి చెల్లుబాటు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. వివాహం అనేది కేవలం 'పాటలు, డ్యాన్స్‌లు, విందు వినోదాల' కోసం జరుపుకునే వేడుక కాదని కోర్టు వ్యాఖ్యానించింది. భౌగోళిక, సాంస్కృతిక వైవిధ్యాలు ఉన్నప్పటికీ, ఈ సంప్రదాయ వేడుకలు ఒక వ్యక్తి ఆధ్యాత్మికతను శుద్ధి చేసి, పరివర్తన చెందిస్తాయని నమ్ముతారని హైకోర్టు జూన్ 23 నాటి ఉత్తర్వులో పేర్కొంది.ఒక జంట మధ్య జరిగిన వివాహాన్ని చెల్లనిదిగా ప్రకటించడానికి నిరాకరించిన ఫ్యామిలీ కోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ,

➢ మిగతా 2వ పేజిలో..



## ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు మరింత ఆలస్యం

- పెద్దగా ప్రభావం ఉండేలా కనిపించని పరిస్థితి
- వరి బదులు ఆరుతడి పంటలపై సిఎం రేవంత్ సూచనలు

➢ మిగతా 11వ పేజిలో..




## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

హైదరాబాద్,జూలై1 (అక్షరం న్యూస్) తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జూలై 2వ తేదీన గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు జరగనుంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ సమావేశ మందిరంలో ఈ 34వ మంత్రిమండలి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ కేబినెట్ సమావేశం జరిగే సమయంలో అధికారులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సిఎస్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇకపోతే వివిధ అంశాలపై ఈ కేబినేట్‌లో చర్చించనున్నారు. ఇటీవలే కేంద్రం మూసీ ప్రక్షాళనకు ఆమోదం తెలిపింది. అలాగే మెట్రోకు కూడా పచ్చ జెండా ఊపింది. ఈ క్రమంలో ఎ లా ముందుకు వెళ్లాలన్నదానిపై చర్చించే అవకాశం ఉంది.

# ఆదాయ సమీకరణపై దృష్టి సారించండి

- ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలి
- శాఖల వారీగా సామర్థ్యాన్ని పెంచుకోవాలి
- అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం



హైదరాబాద్, జూలై1 (అక్షరం న్యూస్) ఆదాయ సమీ కరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలని అన్నారు. హెచ్ఎండిఏ,టిజిఐఐసి, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు. బుధవారం ఎమ్‌సీఆర్‌హెచ్ఆర్‌డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఛేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచు కోవాలని సీఎం సూచించారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్దిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా బ్జడెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు. ఊహాజనిత బ్జడెట్ కాదని.. వాస్తవికత ఆధారంగానే బ్జడెట్‌ను రూపొందించ ుకోవాలని అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం

➢ మిగతా 2వ పేజిలో..




## ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యుల కీలక పాత్ర

- నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి
- డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర

హైదరాబాద్,జూలై1 డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. తమ నైపుణ్యం ద్వారా ప్రతి రోజూ వేల ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు ఆరోగ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, తగిన మానవ వనరులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 440 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, సుమారు 800 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. డాక్టర్లతో పాటు ఇతర పోస్టులను కూడా పెద్ద సంఖ్యలో భర్తీ చేశామని చెప్పారు. సుమారు 15 వేల పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డెంటిస్టుల ఆకాంక్షను నెరవేర్చుతూ 48 డెంట

➢ మిగతా 2వ పేజిలో..



## జూలై 20 నుంచి పార్లమెంట్

- మూడు వారాలపాటు వర్షాకాల సమావేశాలు
- అంతకు ముందే క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ?

న్యూఢిల్లీ, జూలై 1 (అక్షరం న్యూస్): పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20న ప్రారంభమై మూడు వారాలపాటు కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ(సీసీపీఏ) తుది నిర్ణయం తీసుకోవలసి ఉంది. సాధారణంగా వర్షాకాల, శీతాకాల సమావేశాలు నాలుగు వారాలకు విస్తరించి 20 సిట్టింగ్‌లతో ఉంటాయి. అయితే తక్కువ కాలం నిర్వహించిన సమావేశాలు కూడా గతంలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో బీజేపీ విజయాల తర్వాత మొదటిసారి వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. రానున్న సమావేశాల్లో టీఎంసీ, శివసేన(యూబీటీ)లో తలెత్తిన తిరుగుబాట్లు కీలక భూమికను పోషించనున్నాయి. తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని కోరుతూ 20 మంది టీఎంసీ, శివసేన(యూబీటీ)

➢ మిగతా 2వ పేజిలో..

## మహారాష్ట్రలో బాబ్లీ గేట్లు ఎత్తివేత

నిజామాబాద్,జూలై1 మహారాష్ట్రలోని ఎగువ గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ గేట్లను సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి), మహారాష్ట్ర, తెలంగాణ ఇరిగేషన్ అధికారుల సమక్షంలో 14 గేట్లను ఎత్తివేశారు. బాబ్లీ ప్రాజెక్టులో నీటి నిల్వ స్వల్పంగా ఉండడంతో తెలంగాణ ప్రాంతానికి కేవలం 0.20 టిఎంసిల వరద

➢ మిగతా 2వ పేజిలో..

## రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉంది

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

➢ 2వ పేజిలో..



## ట్రాఫిక్ తదితర సమస్యలపై చెక్ పెట్టే సాంకేతికత

- అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యం
- సిఎం రేవంత్‌తో భేటీ అయినా మేఘా కృష్ణారెడ్డి
- అన్‌లాగ్ సిఇవో అలెక్స్ కిప్‌మాన్

హైదరాబాద్,జూలై1 (అక్షరం న్యూస్) ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్టక్చర్ సంస్థ ఎండీ పి. కృష్ణారెడ్డి ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో

➢ మిగతా 2వ పేజిలో..

## ఆదాయ సమీకరణపై దృష్టి సారించండి

సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ తదితర సమస్యలపై చెక్ పెట్టే సాంకేతికత

సమావేశమయ్యారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈఓ, హైదరాబాద్ మెట్రోరైల్ అదనపు ఎండీ బి. అజిత్ రెడ్డి పాల్గొన్నారు.అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో భవిష్యత్తరాలకు అవసరమైన మేధోపరమైన మౌలిక సదుపాయాలు, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై తమ ఆలోచనలను సమావేశంలో వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై వారు సమావేశంలో వివరించారు. గరంలో అత్యాధునిక ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్ ఫామ్స్ వినియోగం వల్ల ప్రయోజనాలను తెలిపారు.సెన్సర్లు, రోబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా సురక్షితమైన, సమర్థవంతమైన, వేగంగా స్పందించే పట్టణ రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఎలా తోడ్పుతుందన్న అంశాలను వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి తదనుగుణంగా సిగ్నళ్ల వ్యవస్థ, నీటి లీకేజీలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వినియోగాన్ని నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు మార్గం సుగమం చేయడం వంటి కాగ్నిటివ్ సిటీస్ రూపకల్పనకు ఉన్న విస్తృత అవకాశాలను సమావేశంలో సమావేశంలో వివరించారు.

వేగంగా పెరుగుతున్న పట్టణాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ప్రభుత్వాల కార్యనిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పౌరులకు అందించే సేవలను మరింత మెరుగుపరచడం, అలాగే డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళికకు ఎలా దోహదపడతాయో ఇరు సంస్థలు వివరించాయి. సందర్భంగా ముఖ్యమంత్రి ఇటు సంస్థలకు పలు సూచనలు చేశారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని తీసుకురావాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేలా ఎఐ కి అనుసంధానించాలని సీఎం సూచించారు. మావేశం అనంతరం ముఖ్యమంత్రి గారి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్త భాగస్వామ్యంతో అవగాహన ఒప్పందం కుదిరింది. పరస్పరం సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ఒప్పందం కీలకంగా మారుతుంది.

# మహారాష్ట్రలో బాబ్లీ గేట్లు ఎత్తివేత

మాత్రమే వచ్చింది. ఈ దశాబ్ద కాలంలో ఎగువ గోదావరి నుంచి ఇంత తక్కువ మొత్తంలో వరద రావడం ఇదే తొలిసారి అని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఎత్తిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు అక్టోబర్ 28వ తారీఖు వరకు తెరిచి ఉంటాయి. అంతర్ రాష్ట్ర జలవివాదాలు నేపథ్యంలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలంలో, ఎండాకాలంలో బాబ్లి గేట్లను ఎత్తి దిగువకు వరద వదిలిపెడుతున్నారు.

## ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యుల కీలక పాత్ర

సర్జన్ పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో సుమారు 1,300 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. డాక్టర్ల దశాబ్దకాల ఆకాంక్ష అయిన ఉస్మానియా నయా హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించామని, అలాగే గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో నూతన హాస్టళ్ల నిర్మాణం పూర్తికావొచ్చిందని మంత్రి తెలిపారు. వైద్యులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, ఇతర సిబ్బందికి మెరుగైన వర్క్ ఎన్విరాన్‌మెంట్ కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం మేర పెంచామని మంత్రి గుర్తు చేశారు. అ÷-దదె భవనాలు, పాత భవనాల్లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆధునిక భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ వైద్యుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా వైద్యులు తమ సేవలను కొనసాగించాలని కోరుతూ, డాక్టర్స్ డే సందర్భంగా మరోసారి రాష్ట్రంలోని వైద్యులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## అయోధ్య చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం

**నిందితుల నుంచి రూ.70,25,000 నగదు సీజ్**

లక్నో,జూలై1 అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో పోలీసులు నిందితుల ఇళ్ల నుంచి రూ.70,25,000 నగదును సీజ్ చేశారు. అత్యధిక శాతం నగదు నిందితుడు అవినాశ్ శుక్లా ఇంట్లో లభించింది. అతడి ఇంట్లో రూ.20 లక్షలను సీజ్ చేశారు. కరుణెళిశ్ పాండే ఇంటి నుంచి మరో రూ.18 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. అనుకల్ప్ మిశ్రా ఇంట్లో రూ.16 లక్షలు లభించాయి. అవినాశ్ శుక్లా ఇంట్లో 1,121 యూఎస్ డాలర్స్ కూడా లభించాయి. ఆయోధ్య రామ మందిర విరాళాల అవకతవకల కేసుపై దర్యాప్తు చేసేందుకు యూపీ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సిట్ నివేదిక మేరకు జూన్ 25న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి లోతైన దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. అవినాశ్ శుక్లా, అనుకల్ప్ శుక్లా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణెళిశ్ పాండే, రామశంకర్ మిశ్రా, శుభాష్ శ్రీవాత్సవ, రామశంకర్ యాదవ్‌లను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. జులై 13 వరకూ వారికి కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దర్యాప్తులో భాగంగా పలు చోట్ల రెయిడ్స్ నిర్వహిస్తున్న పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బంధువులను కూడా ప్రశ్నిస్తున్నారు.

# రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉంది

హైదరాబాద్,జూలై1: రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే మళ్లీ అధికారంలోకి వస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలలు కంటున్నారని ఆమె విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు లేవని చెబుతూ, మరోవైపు మూసీ ప్రాజెక్టుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా పేద ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని కవిత అన్నారు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే సంకల్పంతోనే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదలపై ఆర్థిక భారం లేకుండా ఉచిత విద్య, ఉచిత వైద్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అజెండా మారుస్తానన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని హార్డ్ వర్క్‌నే నమ్ముకోవాలని కవిత సూచించారు.

# తెలంగాణను పదేపదే కించ పరుస్తున్న రేవంత్

- కాళేశ్వరంపై ప్రపంచమంతా అభినందిస్తే...విమర్శలా
- కోటి ఎకరాల మాగాణంగా కెసిఆర్ తీర్చిదిద్దారు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై మేం చర్చకు సిద్ధమే
- తేదీ సమయం చెబితే రావడానికి రెడీగా ఉన్నాం
- మీడియా సమావేశంలో రేవంత్‌కు కెటిఆర్ సవాల్

హైదరాబాద్,జూలై1:కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశంలో 50 శాతం పూర్తయిందని.. ఇప్పటివరకు ఏం చేశారో ఆ పార్టీ చెప్పుకోలేకపోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయేనాటికి రూ.3.50లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అప్పుల కారణంగా దిల్లీకి వెళితే ఇజ్జత్ పోతోందంటున్న సీఎం.. 72 సార్లు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా?అని సీఎం విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తేదీ, సమయం ఫిక్స్ చేయాలన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా కేసీఆర్ తీర్చిదిద్దారు. 2014-15లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 26లక్షల హెకార్లు మాత్రమే. కేసీఆర్ అధికారం నుంచి దిగేపోయే నాటికి ఆ సంఖ్య 59 లక్షల హెక్టార్లకు చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ముందుకెళ్లి అద్భుతాలు చేశాం. హైదరాబాద్‌ను చూసి న్యూయార్క్‌లా ఉందని రజనీకాంత్ అన్నారు. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను చూసి ఫోన్ చేసి అభినందించారు. ఫాక్స్‌కాన్ ఛైర్మన్ కూడా గతంలో హైదరాబాద్‌పై ప్రశంసలు కురింపించారు. సీఎం రేవంత్ పదేపదే రాష్ట్రాన్ని అవమానిస్తున్నారు. మమ్మల్ని దూషించండి, కేసులు పెట్టుకోండి.. కానీ తెలంగాణను దూషించవద్దు, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీయవద్దు. ఇంతటి భావదారిద్య్రం ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదు. తెలంగాణ గొప్పతనం, ఎదుగుదల రేవంత్‌కు జీర్ణం కాకపోవచ్చు. పరిపాలన చేతగాక గత ప్రభుత్వంపై ఇంకా ఎన్ని రోజులు ఏడుపులు? సీఎం, డిప్యూటీ సీఎంకు అబద్దాలు చెప్పడంలో కూడా పొంతన లేదు. కాగ్ లెక్కలు నమ్మాలా? కాకి లెక్కలు నమ్మాలా? సీఎం, కుటుంబ సభ్యుల దోపిడీతో రాష్ట్రం ఆస్తులు కోల్పోతోంది. దండుపాళ్యం ముఠాలా కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రాహుల్ బంధు, పొంగులేటి బంధు, సోదరుల బంధు బంద్ చేయాలి. అబద్దాలు ఆడటం రేవంత్‌కు జన్మహక్కు. ఈసారి ఆయనకు ప్రతిపక్ష పాత్ర కూడా మిగలదు. అద్భుతమైన ప్రగతిభవన్ ఉంటే దాన్ని వదిలేసి రూ.200 కోట్లతో మరో క్యాంపు కార్యాలయం నిర్మించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికే రూ.19 కోట్లు ఖర్చు చేశారు. కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం. తేదీ, సమయం ఫిక్స్ చేయాలి. అసెంబ్లీనా?ప్రెస్‌క్లబ్‌లోనా?జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లోనా? ఎక్కడైనా నేను రెడీ. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ చౌరస్తానా? 2లక్షల ఉద్యోగాలు అని రాహుల్‌గాంధీ డైలాగులు కొట్టిన అశోక్‌నగర్ చౌరస్తానా? మీరొస్తారో, రాహుల్‌గాంధీ వస్తారో రండి. మీ తప్పులను గణాంకాలతో సహా బయటపెడతాం. పాలనా వైఫల్యాలను ఎండగట్టకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటా' అని రేవంత్‌కు కేటీఆర్ సవాల్ విసిరారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని తదితరులు పాల్గొన్నారు.

# జూలై 20 నుంచి పార్లమెంట్

ఎంపీల వినతులు ప్రస్తుతం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పరిశీలనలో ఉన్నాయి.

### రాజ్యసభలో పెరిగిన ఎన్డీయే బలం

కొత్తగా ఎన్నికైన సభ్యులు, తిరిగి ఎన్నికైన సభ్యులు ప్రమాణం చేయడంతో రాజ్యసభలో రాజకీయ పార్టీల బలాబలాలు అధికార ఎన్డీయేకు అనుకూలంగా మారాయి. 2029 నాటికి చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం లక్ష్యంగా ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు దిగువ సభలో వీగిపోవడంతో ప్రభుత్వానికి గత పార్లమెంట్ సమావేశాలు నిరాశతో ముగిశాయి. అన్ని రాష్ట్రాల లోక్‌సభ స్థానాలను ఏకరీతిగా 50 శాతం వరకు పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం ఇప్పుడు ఆ బిల్లును తిరిగి రూపొందిస్తున్నది. జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్య పెరుగడం దక్షిణాది పార్టీలకు ఒక ప్రధాన ఆందోళనగా మారింది.

### త్వరలో క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ?

ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర క్యాబినెట్ త్వరలో పునర్వ్యవస్థీకరణ జరుగుతుందన్న ఊహాగానాల నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయి. వర్షాకాల సమావేశాలకు ముందుగానే మంత్రివర్గం పునర్వ్యస్థీకరణను ప్రకటించవచ్చని తెలుస్తున్నది. ఏ క్షణమైనా క్యాబినెట్‌లో మార్పులు చేర్పులు నిర్వహించే అవకాశం ఉన్నట్లు గత కొన్ని రోజులుగా ఉన్నత స్థాయి నుంచి సూచనలు అందుతున్నాయి. బీజేపీ నూతన అధ్యక్షుడు నితిన్ నబీన్ సారథ్యంలో పార్టీకి కొత్త కార్యవర్గాన్ని కూడా ఇదే సమయంలోనే ప్రకటించే అవకాశం ఉందని తెలిసింది.

# వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌కు బ్రేక్

- మెటాకు కేంద్రం నోటీసులు..వివరాలు ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ,జూలై1: వాట్సప్‌లోని యూజర్‌నేమ్ ఫీచర్ విషయంలో మెటాకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని సూచించింది. అప్పటి వరకు భారత పౌరులకు యూజర్‌నేమ్ ఫీచర్ రోల్‌అవుట్‌ను ఆపాలని పేర్కొంది. ఈ వ్యవహారంలో సంప్రదింపులు పూర్తయ్యాకనే ఈ అంశంపై ముందుకెళ్లాలని నోటీసుల్లో పేర్కొంది. యూజర్‌నేమ్ విషయంలో సైబర్ నిపుణుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రముఖుల పేర్లతో మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, దుర్వినియోగానికి ఈ ఫీచర్ వీలు కల్పిస్తోందన్న ఆందోళనల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది.ఫోన్ నంబర్ ప్రైవసీని కాపాడుతూ యూజర్ నేమ్ ఆప్షన్‌ను వాట్సప్ తీసుకొస్తోంది. దీనివల్ల యూజర్లు ఫోన్ నంబరును షేర్ చేయాల్సిన అవసరం ఉండదు. కేవలం యూజర్ నేమ్‌ద్వారా సంభాషణలను జరపవచ్చు. ప్రస్తుతం యూజర్ నేమ్‌ను రిజర్వు చేసుకునేందుకు వాట్సప్ అనుమతిస్తోంది. యూజర్ నేమ్‌లో 3 నుంచి 35 క్యారక్టర్లను అనుమతిస్తారు. అందులో సెలబ్రిటీలు, అత్యున్నత స్థాయి వ్యక్తుల పేర్లను అనుమతించబోరు. యూజర్ నేమ్‌వల్ల ఫోన్ నంబరు కనిపించదని, పెద్ద గ్రూపుల్లో మీరు యాడ్ అయినప్పుడు మీ ప్రైవసీకి రక్షణ లభిస్తుందనేది వాట్సప్ వాదన.ఫోన్ నంబర్‌ను షేర్ చేయకుండా చాట్ చేయడానికి వాట్సప్ తీసుకొచ్చిన యూజర్ నేమ్ సదుపాయంపై సైబర్ నిపుణులు ఆందోళనలు వ్యక్తంచేస్తున్నారు. సుపరిచిత వ్యక్తుల పేర్లతో నకిలీ యూజర్‌నేమ్స్ సృష్టించి, ప్రజలను మోసం చేసేందుకు ఈ ఫీచర్ అవకాశం కల్పిస్తోందని హెచ్చరిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఏదో ఒక యూజర్‌నేమ్‌ను అంచనా వేసి నేరుగా మెసేజ్ చేసే అవకాశం ఉండటంతో స్పామ్ కాల్స్, సందేశాలు పెరిగే అవకాశం ఉందని సైబర్ నిపుణుల వాదన. ఫోన్ నంబర్లు గోప్యంగా ఉంచడం వరకు బాగున్నా.. మోసాలను అరికట్టడానికి తగిన భద్రతా చర్యలు లేకపోతే టెలిగ్రాం తరహా మోసాలకు వాట్సప్ వేదికగా మారుతుందన్న ఆందోళనలూ నెలకొన్నాయి. ఈ ఫీచర్‌పై పూర్తి వివరాలు ఇచ్చేందుకు మెటాకు కేంద్రం మూడు రోజుల గడువు ఇచ్చినట్టు కూడా తెలుస్తోంది. భారత్ లాంటి దేశంలో ఈ ఫీచర్ కొత్త చిక్కులు తేవొచ్చన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇది అనేక మోసాలకు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# హిందూ వివాహంలో రిజిస్ట్రేషన్ మాత్రమే సరిపోదు

యూకేలో నివసిస్తున్న ఒక వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌పై ఈ తీర్పు వెలువడింది. గతేడాది నవంబర్‌లో ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును రద్దు చేస్తూ, జస్టిస్ ఇలేష్ వోరా, జస్టిస్ ఆర్.టి. వాచ్ఛానిలతో కూడిన డివిజన్ బెంచ్, సప్తపది వంటి ఆవశ్యకమైన వేడుకలను నిర్వహించడమే హిందూ వివాహానికి పునాది అని తన ఉత్తర్వులో పేర్కొంది. ఈ ఉత్తర్వు ప్రతిని సోమవారం అందుబాటులోకి తెచ్చారు.

సప్తపది వంటి వేడుకలు.. అంటే వధూవరులు పవిత్రమైన అగ్ని ముందు కలిసి ఏడు అడుగులు వేయడం వివాహానికి పవిత్రమైన సంస్కారంగా ఆధ్యాత్మిక, సామాజిక, చట్టపరమైన హోదాను కల్పిస్తాయని కోర్టు పేర్కొంది.

### అసలు కేసేంటి?

యునైటెడ్ కింగ్‌డమ్ లో నివసిస్తున్న కౌశల్ సోనార్ అనే వ్యక్తికి, అహ్మదాబాద్‌కు చెందిన ఒక మహిళకు పెళ్లయినట్లు ఒక రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ వెలుగులోకి వచ్చింది. అయితే, సదరు మహిళ తన తల్లిదండ్రుల వద్దకు వచ్చి మ్యారేజ్ సర్టిఫికేట్ చూపించే వరకు తనకు ఆ పెళ్లి గురించి తెలియదని, తన సంతకాన్ని ఫోర్జరీ లేదా మోసపూరితంగా సేకరించారని కౌశల్ కోర్టును ఆశ్రయించాడు. తమ మధ్య ఎలాంటి హిందూ సంప్రదాయ వివాహ క్రతువులు జరగలేదని, భార్యాభర్తలుగా కలిసి ఉండలేదని స్పష్టం చేశాడు.ఈ వివాహం చెల్లదంటూ కౌశల్ దాఖలు చేసిన పిటిషన్‌ను గతంలో ఫ్యామిలీ కోర్టు కొట్టివేయగా, ఆయన హైకోర్టులో అప్పీల్ చేశారు. విచారణలో.. తమ మధ్య ఎలాంటి సంప్రదాయ వివాహ క్రతువులు జరగలేదని సదరు మహిళ కూడా అంగీకరించింది. దీంతో ఫ్యామిలీ కోర్టు తీర్పును తప్పుబడుతూ హైకోర్టు ఆ వివాహాన్ని రద్దు చేసింది.

## ప్రగతి ప్రణాళిక అమలుపై ఆరా

**అధికారులతో సమీక్షించిన సిఎస్ సంజయ్ జాజు**

హైదరాబాద్,జూలై1: రాష్ట్రంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించిన నోడల్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించిన సమస్యలు, సవాళ్లను సిఎస్ కు వివరించారు. అలాగే జిల్లాలలో అమలు చేసిన వినూత్న విధానాలతో సానుకూల ఫలితాలు వచ్చాయని, వాటిని ఇతర జిల్లాల్లో కూడా అమలు చేయవచ్చని సూచించారు. జిల్లా కలెక్టర్లతో చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోడల్ అధికారులను ఆదేశించారు. ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ 99 రోజుల కార్యక్రమంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలను అందించారు. కార్యక్రమంలోని వివిధ అంశాల కింద ఇప్పటివరకు సాధించిన పురోగతిని ఆయన వివరించారు. సమీక్షాసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, నోడల్ అధికారులు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

**నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాల్సిందే**

**కూనంనేని ఆధ్వర్యంలో లెఫ్ట పార్టీల ధర్నా**

కొత్తగూడెం,జూలై1 ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ మాస్ లైన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎవరినైనా ప్రశ్నిస్తానన్నారు. పాలక ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను కొలగొట్టేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. సర్ పేరుతో ఓట్లను తొలగించి తమకు అనుకూలమన్న ఓటర్లను మాత్రమే చేర్చే పక్రియ చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, జీవో నెంబర్ 76 ను పునరుద్ధరించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. పేదల పక్షాన పోరడడానికి తాను ఎప్పుడు సిద్ధమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మూడు గణెళిష్, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ముత్యాలు, విశ్వనాథం, తుపాకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## శాఖాహార ఆవశ్యకత పై భారీ ర్యాలీ




మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూలై 01/ అక్షరం న్యూస్ –:

మందమర్రి పట్టణం బస్టాండ్ గవర్నమెంట్ హాస్పటల్ నుండి రామన్ కాలనీ మార్కెట్ ఏరియా వరకు శాఖాహార ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ ఆచార్య శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవహింస వద్దు శాకాహారం ముద్దు, పశువుల రక్షనే మానవాళికి రక్షణ, శాఖాహారమే సంపూర్ణ పోషకాహారం అంటూ ప్లిప్ కార్డులు బ్యానర్లు ధరించి భారీ ప్రభంజన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆచార్య శ్రీనివాస్ దంపతులు మాట్లాడుతూ జీవహింస వలన మానవాళికి భవిష్యత్తులో రక్షణ లేకుండా పోతుందని పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందని మనుషులందరూ నిర్వహించ మానుకొని కేవలం శాఖాహారానికి పరిమితం కావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాకాహారప్రియులు ప్రజలు పాల్గొన్నారు.

## వీబీజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలి

- **తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ధర్నా**



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూలై 01: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగాకొనసాగిస్తూ నిరుపేద కూలీల నోటికాడి బుక్కను కొల్లగొట్టే వీబీజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని సీఐటీయు జిల్లా అధ్యక్ష డు రాపర్తి రాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జూనియర్ అసిస్టెంట్ విక్రమ్ కు అందజేశారు. అలాగే ఎన్ఆర్ జీఎస్ యాథావిధిగా కొనసాగించాలని కోరుతూ మండలంలోని నిడిగొండ, శ్రీమన్నారయణపురం, కోమల్ల, కుర్చపల్లి, ఆశ్వరావుపల్లి గ్రామాలలో పంచాయతీ కార్యాలయాల ఎదుట కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంగాపురం మహేందర్, మైలారం వెంకటేశ్వర్లు, పొదల నాగరాజు, బైరగోని బాలరాజు, నామాల యాదగిరి, కడారి ఐలయ్య, పొదల నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను మరింత మెరుగుపర్చడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

- **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూలై 01: రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ లో ని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లెక్కల మాస్టర్ గా వ్యవహరించి గణితంకు సంబంధించిన సులభ పద్దతులను విద్యార్థులకు వివరించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఖిలాషాపూర్ లో ని కేజీబీవీతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం సందర్శించి అన్ అకాడమీ తరగతులను ప్రారరంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోనే జీవితంలో ఉన్నతమైన స్థానాలకు వెళ్లేందుకు అస్కారం ఉంటుందని, విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి అత్యుత్తమ స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తేవలన్నారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలను మెరుగుపర్చుడానికి ఉపాధ్యాయులు అంకిత భావంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా పరిసరాలలో పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలనిఆదేశించారు.అంతకు ముందు పాఠశాలల పరిసరాలను, తరగతి, వంట గదులను, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ఆహార నాణ్యతను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇవో రఘనందన్ రెడ్డి,హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు భారత రవీందర్, కెజీబీవీ ప్రిన్సిపాల్ హేమలత తదితరులు పాల్గొన్నారు.



# సహకారమే సమాజ శ్రేయస్సుకు పునాది



- **ములుకనూరు డెయిరీలో సహకార ఉత్సవాలు..**

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 1/అక్షరం న్యూస్:–

కేంద్ర ప్రభుత్వం సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సహకార ఉత్సవాల్లో భాగంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు డెయిరీలో సహకారం ద్వారానే శ్రేయస్సు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.డెయిరీ అధ్యక్షురాలు ధనశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా సహకార అధికారి బి. మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సహకార శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. యాకుబ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీందర్, డెయిరీ జనరల్ మేనేజర్ మార్పటి భాస్కర్ రెడ్డి, సహకార సంఘాల అధ్యక్షులు డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీసీఓ బి. మోహన్ మాట్లాడుతూ సహకార వ్యవస్థ బలోపేతంగా ఉన్న ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని, గ్రామీణాభివృద్ధికి సహకార సంఘాలు కీలకమని పేర్కొన్నారు. సహకార సంఘాలు శిక్షణతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకుంటే మరింత బలోపేతమవుతాయని ప్రిన్సిపాల్ ఎల్. యాకుబ్ తెలిపారు.డెయిరీ జనరల్ మేనేజర్ మార్పటి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ములుకనూరు డెయిరీ సహకార సంఘాల ద్వారా సభ్యుల కుటుంబాలు, గ్రామాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాయని చెప్పారు. రాష్ట్రంలోనే ములుకనూరు డెయిరీ సహకార వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.





ఇతర సహకార సంఘాలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. సహకార సిద్ధాంతాల అమలు సంఘాల బలోపేతం సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా గ్రామీణ సమాజ సమగ్రాభివృద్ధే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జనరల్ మేనేజర్ భాస్కర్ రెడ్డి తెలిపారు.

## హవల్దార్‌పల్లి అంగన్‌వాడిలో పోషకాహారం మాయం?

- **రికార్డుల్లో పూర్తి పంపిణీ.. కేంద్రంలో పిల్లల హాజరు మాత్రం తక్కువ!**
- **ఆకస్మిక తనిఖీలతో వాస్తవాలు వెలికితీయాలని గ్రామస్తుల డిమాండ్..**



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 1/అక్షరం న్యూస్:–

ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు చిన్నారుల పోషకాహారం కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా.. అవి నిజమైన లబ్ధిదారులకు చేరుతున్నాయా? హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామ పంచాయతీ పరిధిలోని హవల్దార్‌పల్లి అంగన్‌వాడి కేంద్రంపై వస్తున్న ఆరోపణలు ఈ ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. కేంద్రానికి వచ్చే పోషకాహార సరుకులు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందడం లేదని రికార్డుల్లో మాత్రం పంపిణీ చేసినట్లు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.గ్రామస్తుల కథనం ప్రకారం అంగన్‌వాడి కేంద్రానికి రోజూ వచ్చే చిన్నారుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నప్పటికీ హాజరు రిజిస్టర్లలో మాత్రం అధిక సంఖ్యలో పిల్లలు హాజరైనట్లు నమోదు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వాస్తవ హాజరు, అధికారిక రికార్డుల మధ్య వ్యత్యాసం ఉండడంతో ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహార సరుకులు ఎక్కడికి వెళ్తున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ కేంద్రంపై గతంలోనూ పలు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి అక్రమాలకు అవకాశం కలుగుతోందని వారు అంటున్నారు.

అంగన్‌వాడి కేంద్రంలోని పిల్లల వాస్తవ హాజరు పోషకాహార సరుకుల నిల్వలు పంపిణీ రిజిస్టర్లు లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే అసలు వాస్తవాలు బయటపడతాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఐసీడీఎస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఆరోపణల్లో నిజానిజాలు తేల్చాలని అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు..**

ఈ ఆరోపణలపై అంగన్‌వాడి కార్యకర్త లేదా సంబంధిత ఐసీడీఎస్ అధికారుల స్పందన ఇంకా అందుబాటులోకి రాలేదు. వారి వివరణ వచ్చిన తర్వాత పూర్తి చిత్రణ వెల్లడయ్యే అవకాశం ఉంది. అధికారుల స్పందన వచ్చిన వెంటనే దానిని కూడా ప్రచురించేందుకు అవకాశం ఉంటుంది.

## యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహాస్వామి ధర్మకర్తల మండలి సభ్యుడు నిగా నియమితులైన లక్ష్మీనారయణ నాయక్ కు ఘనంగా సన్మానం



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూలై 01: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడిగా నియవి తులైన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి భర్త సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారయణ నాయక్ ను రఘునాథపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు బానోతు బిక్షపతి నాయక్, తాటికొండ వెంకటేష్ యాదవ్.భూక్య జయ రాం, వేముల మల్లేష్, ధరావత్ రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి డీజీఎం కు ప్రశంసా పత్రం అందజేసిన ఆంజనేయులు సాగర్



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్, రాజీవ్ నగర్, సిద్ధిఖీ నగర్, పీజేఆర్ నగర్ కాలనీల్లో వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రజల అవసరాలను గుర్తించి, విజ్ఞప్తి చేసిన వెంటనే స్పందించి నీటి ఎద్దడి తలెత్తకుండా చూసిన జలమండలి డీజీఎం నరేందర్ రెడ్డి, మేనేజర్ విక్రమ్ లకు ప్రశంసా పత్రాన్ని అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ అందజేశారు.డ్రైనేజీ సమస్యలు ఎక్కడ తలెత్తినా వెంటనే డ్రైనేజీ ట్యాంకర్లు, సిబ్బందిని పంపించి సమస్యలను పరిష్కరించడంలో చూపిన చొరవతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ మూతలను ఏర్పాటు చేయించినందుకు ఆంజనేయులు సాగర్ ప్రశంసిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఇదే విధంగా స్పందిస్తూ... సేవలందించాలని ఆంజనేయులు సాగర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంతోష్, రామకృష్ణ సాగర్, శివ రాజ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం ఏరియా ఆస్పత్రిలో జూలై 5న సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం

నాలుగు ప్రధాన విభాగాల నిపుణుల సేవలు -- జూలై 4లోపు నమోదు తప్పనిసరి

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) రామగుండం ఏరియా--1 ఆధ్వర్యంలో గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో ఈ నెల 5వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ కొత్తపేటలోని ఓజోన్ ఆస్పత్రికి చెందిన సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించనున్నారు.శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, నరాల సంబంధిత వ్యాధులు, మూత్రనాళాలు, మూత్రాశయం సంబంధిత శస్త్రచికిత్సలు, మూత్రపిండాల సంబంధిత వ్యాధులు వంటి విభాగాలకు చెందిన నిపుణులు రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందిస్తారు.ఈ వైద్య శిబిరానికి హాజరయ్యే వారు జూలై 1 నుంచి జూలై 4వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు రామగుండం ఏరియా ఆస్పత్రిలో తమ ఆస్పత్రి పుస్తకంతో నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ముందస్తుగా నమోదు చేసుకున్న వారికి మాత్రమే శిబిరంలో వైద్య పరీక్షలకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు.రామగుండం ఏరియా--1, 2, 3, ఏఎల్‌పీ ఏరియాల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములు, అలాగే అన్ని గనులు, ఓపెన్‌కాస్ట్ గనులు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి అధికారులు కోరారు.

## సింగరేణిలో తొలి త్రైమాసిక ఉత్పత్తి లక్ష్యాలకు అనుగుణంగా సాగుతోంది: ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్





గోదావరిఖని, జూలై 1: సింగరేణి సంస్థ 2026--27 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచేందుకు కార్యాచరణను వేగవంతం చేసిందని, తొలి త్రైమాసికంలో ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునే దిశగా అన్ని ఏరియాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ తెలిపారు.బుధవారం జిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 30 నాటికి సంస్థ వ్యాప్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 650 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. జూన్ నెలకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఉత్పత్తి కొనసాగుతోందని వివరించారు.ఏరియాల వారీగా చూస్తే కొత్తగూడెం, శ్రీరాంపూర్, యెల్లందు, మణుగూరు తదితర ఏరియాలు మంచి పనితీరు కనబర్చాయని తెలిపారు. రామగుండం-1 (ఆర్జీ-1) ఏరియాలో కూడా ఉత్పత్తి పెంపుపై ప్రత్యేక దృష్టి సారించామని, ఓపెన్‌కాస్ట్, భూగర్భ గనుల్లో అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ లక్ష్య సాధనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తితో పాటు డిస్పాచ్‌లను కూడా పెంచేందుకు చర్యలు చేపట్టామని, వర్షాకాలంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ బొగ్గు సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఉద్యోగులు, అధికారులు సమష్టిగా కృషి చేయడం వల్లే లక్ష్యాల సాధన సాధ్యమవుతోందని, ఇదే స్ఫూర్తితో రానున్న నెలల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రెస్ మీట్ లో ఎస్ ఓ. టు జియం చంద్రశేఖర్, ఎజిఎం ఐఇడి ఆంజనేయులు పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి ఏరియా ఇంజనీర్ రాజాజీ డిజియం ఏరియా వర్క్ షాఫ్ జితేందర్ సింగ్ డిజియం ఫైనాన్స్ ధనలక్ష్మి భాయి, డివైపిఎం వేణు, సీనియర్ పిఒలు శ్రావణ్ కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు

## ఇబ్రహీంపూర్ పెద్ద చెరువును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



జనగామ జిల్లా/ రఘునాధపల్లి /(అక్షరం న్యూస్) జూలై 01: మండలంలోని ఇబ్రహీంపూర్ పెద్ద చెరువును ఐబి డిఇ అరుణ్ జ్యోతి, ఎఇ సింధు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇ అరుణ్ జ్యోతి మాట్లాడుతూ చెరువులో నిర్మించిన ముదిరాజ్ కమ్యూనిటీ భవనం, పెద్దమ్మ గుడితో పాటు కొన్ని నివాస గృహాలు సైతం ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఆక్రమ కట్టడాలేనని, ఇవన్నీ ఎఫ్ టి ఎల్ పరిధిలోనే ఉన్నాయన్నారు చెరువు మత్తడి. తూము మరమ్మతులకు రూ.13 లక్షలు మంజారయ్యాయని. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు అదేవిధంగా మండలంలోని ఆశ్వరావుపల్లి రిజర్వాయర్ నుండి వరి పంటకు అవసరమైన సాగు నీరును ఇరిగేషన్ అధికారులతో పాటు సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు తూము ద్వారా బుధవారం విడుదల చేశారు. కార్య క్రమంలో సర్పంచ్లు పోకల శ్రీనివాస్,పొన్నగంటి చైతన్య రాజు, ఉప సర్పంచ్ చింత నరేష్, నామాల బుచ్చయ్య పండుగ నవీన్, నూనె మల్లేష్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



## ఏజెన్సీ ప్రాంత జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపాలి

- **టీయూడబ్ల్యూజే (ఐజేయు) సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్**

మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/, జూలై 1(అక్షరం న్యూస్ )

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్, ఐజేయు కొత్తగూడ మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడ మండలంలోని గుంజేడు ముసలమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణంలో మండల అధ్యక్షుడు ఎస్.కె. సల్మాన్ పాషా అధ్యక్షతన బుధవారం సభ్యత్వాల పునరుద్ధరణ మరియు నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు దూలం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు శ్రీ చిత్తనూరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ గాడిపెల్లి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, జర్నలిస్టుల ఐక్యతే యూనియన్ బలోపేతానికి మూలమని అన్నారు. ప్రతి జర్నలిస్టు యూనియన్ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడంతో పాటు కొత్తగా అర్హులైన జర్నలిస్టులు సభ్యత్వం పొందాలని సూచించారు. యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు.ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు అనేక ఇబ్బందులు, మౌలిక సదుపాయాల కొరత, రవాణా సమస్యలు, వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఏజెన్సీ ప్రాంత ముద్దుబిడ్డ, రాష్ట్ర మంత్రి శ్రీమతి సీతక్క ఈ అంశంపై ప్రత్యేక చొరవ చూపి, ఏజెన్సీ ప్రాంత జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నందున వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.అనంతరం సభ్యులందరూ సభ్యత్వాల పునరుద్ధరణతో పాటు కొత్త సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశంలో యూనియన్ బలోపేతం, సభ్యుల ఐక్యత, జర్నలిస్టుల సంక్షేమం కోసం జిల్లా కమిటీ చేపట్టే కార్యక్రమాలకు పూర్తి సహకారం అందించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉమ్మగాని మధు,రమణ, సత్యనారాయణ, కోరే పాపన్న, రావూరి ప్రశాంత్, పాలడుగు శ్రీధర్, జంగాల వినయ్ కుమార్, మహమ్మద్ అజ్మీర్, శెట్టి పరశురాములు, మండల ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, మండల ముఖ్య సలహాదారులు సునీల్, ప్రచార కార్యదర్శులు ఉబ్బని శ్రీహరి, తీగల ప్రేమ్ సాగర్, రాకేష్ వర్మ, చాపల శ్రీనివాస్, నాంపల్లి రాజ్ కుమార్, వాసం వెంకటేష్, తాటి సుదర్శన్, బిక్షపతి, యూనియన్ నాయకులు, మండల ప్రతినిధులు, సభ్యులు మరియు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



## రామగుండంలో ఈఎస్ఐ హాస్పత్రి నిర్మించేది ఎప్పుడు

- **2018 సెప్టెంబర్ లో అనుమతి ఇచ్చిన కేంద్రం**
- **అనువైన స్థలం చూపించని గత ప్రభుత్వం**

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పెద్దపెల్లి జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వంద పడకల ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) ఆస్పత్రి నిర్మాణం ముందుకు సాగడంలో అలసత్వం ఎందుకు జరుగుతుందని రామగుండం స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బుధవారం నిరసన తెలిపారు.

అనంతరం రామగుండం స్వచ్ఛంద సంఘాల గౌరవ అధ్యక్షులు లిమద్దెల దినేష్లి ఉపాధ్యక్షులు లిగోలివాడ చంద్రకళలి గారు మాట్లాడుతూ 2018 లోనే హాస్పిటల్ నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతి లభించిన అప్పటి బిఆర్ఎస్ సర్కార్ అనునువైన స్థలం చూపించలేదని తదనంతరం 2022లో సమాధుల పక్కన చెత్త డంపింగ్ యార్డ్ స్థలాన్ని చూపించారని ఈ స్థలానికి రోడ్డు కనెక్టివిటీ లేకపోవడం వల్ల ఈఎస్ఐ అధికారుల బృందం రిజెక్ట్ చేయడం జరిగిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం 2023లో వచ్చిన ఈఎస్ఐ కొత్త నిబంధన ప్రకారం అనువైన స్థలాన్ని ఎంపిక చేయగా 2025 జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదవముద్ర వేసిందన్నారు.

ఇప్పటివరకు పెద్దపల్లి జిల్లా యంత్రాంగం దీని నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రామగుండం ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం చేయడం వల్ల ఆసుపత్రి నిర్మాణం కాకపోవడంతో అసంఘటిత కార్మికులు వారి కుటుంబాలు తీవ్ర నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏదైనా ఒక సంస్థలో 10 మంది అంతకంటే ఎక్కువ మంది పని చేస్తే వారికి ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ ఈఎస్ఐ వర్తింపజేస్తారు.

కార్మికుడు పొందే వేతనంలో 0.75 శాతం కార్మికుడి నుంచి 3.25 శాతం మేనేజ్మెంట్ నుంచి కలిపి మొత్తం నాలుగు శాతం ఈఎస్ఐ కి జమ చేస్తారు.

వేతనంలో ఈఎస్ఐ క్రింద డబ్బులు జమచేసి కార్మికుడికి వారి కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ హాస్పిటల్ లో వైద్య సేవలు అందిస్తారు.

ఈఎస్ఐ రామగుండం బ్రాంచ్ పరిధిలో ఐదు జిల్లాలు వస్తాయని పెద్దపల్లి, మంచిర్యాల్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలకు చెందిన సుమారు 60000 మందికి పైగా కార్మికులు వస్తారని వీరిలో ఈఎస్ఐ డబ్బులు చెల్లించే ఎన్టిపిసి, ఆర్ఎస్ఎల్, సింగరేణి, సిమెంట్ ఫ్యాక్టరీ, ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు షాపింగ్ మాల్స్, మున్సిపల్ కార్మికులు, బీడీ కార్మికులు, కార్మికులకు, బీడీ కార్మికులకు వీవింగ్ మిల్లు కార్మికులకు వైద్య సేవలు అందించాలన్నారు.

ఇందుకోసం రామగుండం ఎన్టీపీసీ బసంత్ నగర్ మంచిర్యాలలో మాత్రమే ఈఎస్ఐ డిస్పెన్సరీలు కొంత నడుస్తున్నాయి, జగిత్యాల సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు చెందిన కార్మికులు ఎక్కడ కూడా ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఏర్పాటు చేయకపోవడంతో వారు వైద్య సేవలకు నోచుకోవడం లేదన్నారు.

ఒకవేళ ఈ జిల్లాలకు చెందిన వారు వైద్యం పొందాలంటే బసంత్ నగర్ లేక ఎన్టిపిసి వరకు వ్యయప్రయాసాలు కోర్చి వెళ్లక తప్పడం లేదన్నారు. పెద్ద జబ్బులు వస్తే వరంగల్,నాచారం సనత్ నగర్ లోని హాస్పిటల్ మరియు ఈఎస్ఐ హాస్పిటల్ లకు రిఫరల్ మీద వెళ్తున్నారన్నారు.

గతంలోనే ఐదు ఎకరాల స్థలం ఉంటేనే ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మించవచ్చని నిబంధనలు మార్పు చేసి 2023లో కొత్త నిబంధనలు తీసుకొచ్చారని రామగుండం పట్టణంలో మూడు ఎకరాల 30 గుంటల స్థలం ఉంటె చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 లో జనవరి 8న ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి అనుమతించిందని ఇప్పటికీ ఏడాది దాటిన జిల్లా అధికార యంత్రాంగం రామగుండం ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం విషయంలో ఎందుకు ముందుకు కదలడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.




కేంద్ర ప్రభుత్వం 100 కోట్ల రూపాయలు 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రికి కోసం నిధులు విడుదల చేసిన జిల్లా అధికార యంత్రాంగం ఎందుకు నిర్లక్ష్యం చేస్తూ అసంఘటిత కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని ఆరు అన్నారు.

రామగుండంలో చుట్టుప్రక్క ప్రాంతాల వేలాది మంది కార్మికులు ఉన్నప్పటికీ ప్రాథమిక హెల్త్ సెంటర్లు మినహా ఎలాంటి మెరుగైన వైద్య సదుపాయాలు లేక అనారోగ్య బాధపడే కార్మికులు హైదరాబాదు లాంటి దూర ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చి ఇబ్బంది పడుతున్నారని, కావున రామగుండంలో త్వరితగతంగా ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని లేనియెడల రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఏకం చేసి పోరాడుతుందని ప్రజా ప్రతినిధులను ప్రభుత్వాన్ని అధికారులను వారు హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపిన కాంట్రాక్ట్ కార్మిక సంఘం నేత ఏం. గౌస్, మరియు వై. లెనిన్ అలాగే స్వచ్ఛంద సంఘాల సభ్యుల కంకటి రవి, బిళ్ళ శ్రీదేవి సరిత లక్ష్మి, కొండూ రమాదేవి, కె. సుశీల, ఇమ్మడి శారద, మేకల శోభా, మండల శ్రీనివాస్, నజీర్, వికాస్ తో పాటు తదితరుల పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్





జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ రామగుండం మాజిద్ టర్నింగ్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం బస్ స్టాండ్ మార్గంలోని చెట్ల తొలగింపు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: గోదావరిఖని బస్ స్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ప్రయాణికులు, వాహనదారులు మరియు పార్కింగ్‌కు ఇబ్బందిగా మారిన చెట్ల తొలగింపు పనులను బుధవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్ స్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రయాణికుల భద్రత, వాహనాల పార్కింగ్ సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అడ్డంకిగా ఉన్న చెట్లను సంబంధిత అధికారుల పర్యవేక్షణలో తొలగిస్తున్నామని పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని, పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు కొనసాగుతాయని ఎమ్మెల్యే తెలిపారు.

# సమయస్ఫూర్తితో వృద్ధుడికి అండగా నిలిచిన హోంగార్డ్ నరేష్ రెడ్డి..



సూర్యాపేట, టౌన్ జూలై 1: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో హోంగార్డ్ నరేష్ రెడ్డి సమయస్ఫూర్తితో స్పందించి ఓ వృద్ధుడి ప్రాణాలను కాపాడారు.

కొత్త బస్టాండ్ వద్ద రెడ్ సిగ్నల్ పడటంతో వాహనాలు ఆగిపోయాయి. అదే సమయంలో ఓ వృద్ధుడు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు రోడ్డు దాటడం ప్రారంభించాడు. ఇంతలో గ్రీన్ సిగ్నల్ పడగానే వాహనాలు ఒక్కసారిగా కదలడంతో ట్రాఫిక్ మధ్యలో వృద్ధుడు చిక్కుకుపోయాడు.

దీనిని అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ నరేష్ రెడ్డి గమనించి వెంటనే స్పందించారు. వాహనాలను అప్రమత్తం చేస్తూ ట్రాఫిక్ మధ్య నుంచి వృద్ధుడిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి బస్టాండ్‌లోకి చేర్చారు.ఈ ఘటనను గమనించిన స్థానికులు హోంగార్డ్ నరేష్ రెడ్డి సమయస్ఫూర్తి, మానవత్వాన్ని అభినందించారు.

# జనగణన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పారితోషికం, డ్యూటీ సర్టిఫికెట్లు వెంటనే అందజేయాలి

- టీఎస్ యుటిఎఫ్




సూర్యాపేట/నేరేడుచర్ల, జూలై 1:(అక్షరం న్యూస్ )వేసవి సెలవుల్లో జనగణన కార్యక్రమంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఎన్యుమరేషన్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులకు పారితోషికం చెల్లించి, డ్యూటీ సర్టిఫికెట్లు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ టీఎస్ యుపిఎఫ్ నేరేడుచర్ల మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్, మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, జనగణన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రకటించిన పారితోషికం, డ్యూటీ సర్టిఫికెట్లను ఎలాంటి జాప్యం లేకుండా అందజేయాలని అధికారులను కోరారు. ఉపాధ్యాయులు విధులను సమర్థవంతంగా నిర్వహించినందున వారికి రావాల్సిన ప్రయోజనాలను తక్షణమే అందించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఆర్. శ్రీనయ్య, సీనియర్ నాయకులు ఎన్. నరసింహారావు, కె. వెంకటేశ్వరరావు, నేరేడుచర్ల మండల ఫఫ్ డబల్యు కన్వీనర్ ఎన్. వెంకటేశ్వర్లు, ఎం. యాదగిరి, ఎం. జానకిరాములు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి బి. అక్కయ్య బాబు పాల్గొన్నారు.

# జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులను సన్మానించిన ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సిమ్స్ మెడికల్ కాలేజీ యాజమాన్యం ఆహ్వానం మేరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కేక్ కట్ చేసి వైద్యులకు జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న వైద్యులను శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు.అలాగే మెడికల్ విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి విద్యాభ్యాసం, లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో కష్టపడి చదువుకుని ప్రజలకు సేవ చేసే గొప్ప వైద్యులుగా ఎదగాలని విద్యార్థులకు ఆకాంక్షించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, వారి అంకితభావం సమాజానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు.




జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# సింగరేణి అధికారుల రిలే దీక్షలకు బీజేపీ నేత కందుల సంధ్యారాణి సంఘీభావం







జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

సింగరేణి అధికారుల సంఘం (సీఎంఓఏఐ), ఆర్జీ-1 శాఖ ఆధ్వర్యంలో ఆర్జీ-1 జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి సందర్శించి అధికారులకు సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సింగరేణి అధికారుల డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవేనని అన్నారు. కోల్ ఇండియాలో అమలు చేసిన వేతనాల మెరుగుదల, పనితీరు ఆధారిత పారితోషికం (పీఆర్పీ), ఇతర అలవెన్సులను సింగరేణి అధికారులకు కూడా వర్తింపజేయాలని, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్పీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అధికారుల సమస్యలను కేంద్ర బొగ్గు శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు బీజేపీ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.వేతన సవరణ అమలు, పదోన్నతులు పారదర్శకంగా కల్పించడం, ఖాళీ పోస్టుల భర్తీ, వైద్య సదుపాయాలు, సంక్షేమ పథకాల మెరుగుదల, పదవీ విరమణ అనంతర ప్రయోజనాల బలోపేతం వంటి డిమాండ్లను యాజమాన్యం సానుకూలంగా పరిశీలించి చర్చల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.సీఎంఓఏఐ ఆర్జీ-1 నాయకులు కందుల సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలుపుతూ, జాతీయ పార్టీ మద్దతుతో తమ ఉద్యమానికి మరింత బలం చేకూరిందని, డిమాండ్లు నెరవేరే వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో టి. అంజయ్య (ఉప మహా ప్రబంధకుడు--భూగర్భ శాస్త్రం, అన్వేషణ, ఆర్జీ-1), జి. కుమారస్వామి (ఉప పర్యవేక్షక ఇంజనీర్, జీడీకే-2 గని), శామ్యూల్ (సర్వే అధికారి, జీడీకే సెంట్రల్ గని), కె. అజయ్ (సీనియర్ అండర్ మేనేజర్, జీడీకే-2 గని), సంజీవ్ రాజు (జూనియర్ సర్వే అధికారి, అన్వేషణ, ఆర్జీ-1), రాజ్‌కుమార్ (జూనియర్ ఇంజనీర్, జీడీకే సెంట్రల్ గని), ఎస్. సాయి నహాల్ (సంక్షేమ అధికారి, జీడీకే-1 గని), లక్ష్మీనగర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఉరగొండ అపర్ణ, నాయకులు కొట్టే నరేష్, శిలారపు కళ్యాణ్, ఏరుకొండ తిరుపతి, అరవింద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### ఒకే రోజులో వెయ్యి సేవా కార్యక్రమాలు

# లక్ష మంది లబ్ధిదారుల లక్ష్యంతో లయన్స్ క్లబ్ సేవలు





జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్--320జీ జిల్లా గవర్నర్ లయన్ మోర భద్రేశం ఇచ్చిన పిలుపు మేరకు లయనిస్టిక్ సంవత్సరం 2026--27 తొలి రోజు బుధవారం "ఒకే రోజులో వెయ్యి సేవా కార్యక్రమాలు -- లక్ష మంది లబ్ధిదారులు" అనే మహత్తర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి, వాసవి, గోదావరిఖని, లక్ష్మీనగర్, జ్యోతినగర్ ప్రగతి జోన్ల ఆధ్వర్యంలో రాజేష్ థియేటర్ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రోడ్డు భద్రత, క్యాన్సర్ అవగాహన, రక్తదానం, పర్యావరణ పరిరక్షణతో పాటు పలు ప్రజా చైతన్య కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ట్రాఫిక్ సీఐ, ఎస్ఐలు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి వచ్చిన వాహనదారులను అభినందిస్తూ వారికి గులాబీ మొక్కలను బహుకరించారు.లయన్ గుంత వినోద్ విరాళంగా అందించిన సైకిల్‌ను ఓ నిరుపేద విద్యార్థినికి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే సదాశయ శ్రావణ్, వాసు అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో అడ్డగుంటపల్లిలో ఉచిత మధుమేహ పరీక్షలు నిర్వహించి, మధుమేహ రోగులకు వైద్య సలహాలు అందించారు. నేత్రదానంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు. లయన్ గుంత వినోద్ దాతృత్వంతో మరోసారి నిరుపేద విద్యార్థికి సైకిల్ పంపిణీ చేశారు.అదేవిధంగా పాలకవర్గ సమావేశం, చార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవం, వైద్యుల దినోత్సవం, తపాలా ఉద్యోగుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు పాఠశాలల్లో ఆరోగ్య అవగాహన, బాల్య క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, మత్తు పదార్థాల నివారణపై ప్రజలకు చైతన్యం కల్పించారు. సాయి సేవా సమితిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు కంటి శస్త్రచికిత్సలకు సహాయం అందించారు. అవసరమైన వారికి దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్‌టీఎల్‌డీసీవో లయన్ నార్ల ప్రసాద్, జోన్ చైర్మన్ కొమురవెల్లి సుధాకర్, పీఎస్‌టీఎస్ కృష్ణమూర్తి, కోదాటి ప్రవీణ్, కిషోర్, రాహుల్, మహేందర్ రెడ్డి, సురేష్, రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, చందర్, జేపీ చావ్డా, వినోద్, శ్రీధర్, రమణారావు, గోపాలరావు, సతీష్, సంతోష్, అనిల్, పోచం, రాజు తదితర లయన్ సభ్యులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

### ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న

# ప్రైవేట్ పాఠశాలల బస్సులపై చర్యలు తీసుకోవాలి..

- బొమ్మగాని వినయ్ గౌడ్



సూర్యాపేట టౌన్ జులై 02 (అక్షరం న్యూస్ )

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులపై చర్యలు తీసుకోవాలనీ తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్ కోరారు .సూర్యాపేట జిల్లాలోని పలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యొక్క పాఠశాలలో బస్సులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడవవలసి ఉన్న అవేమి లేకుండా తమ ఇష్టానుసారంగా నడిపిస్తున్నారనీ తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్ విమర్శించారు. అనుమతులు లేకుండా కనీస జాగ్రత్తలు తీసుకోకుండా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాల బస్సుల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈరోజు స్థానిక ఆర్టీవోకు వినతి పత్రం సమర్పించిన అనంతరం వినయ్ గౌడు మాట్లాడుతూ బస్సులు ఓవర్ లోడింగ్ తో నడుస్తున్నాయి పైపైన రంగులతో ఫిట్నెస్ లేని బస్సులు నడుస్తున్నాయి కొన్ని బస్సులకు క్వాలిఫైడ్ కానీ డ్రైవర్లను నియమిస్తూ కేర్ టేకర్లను నియమించుకోకుండా బస్సులు నడుస్తున్నాయి అని అన్నారు జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ఫిట్నెస్ చేయించాల్సి ఉంది, ఒక పాఠశాల బస్సులు మరో పాఠశాల పేరు మీద నమోదయి ఉండి వేరొక పాఠశాలకు నడిపిస్తున్నారు అన్నారు. అటువంటి పాఠశాల బస్సులపై యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లైసెన్సు అనుకోలేని డ్రైవర్లు కండిషన్ లేని బస్సులను గ్రామాలకు పంపడం మూలంగా చాలా గ్రామాల రోడ్లపైనే బస్సులు ఆగిపోతున్న పరిస్థితి విద్యార్థి జన సమితి తన అధ్యయనంలో గమనించింది అని ఆయన అన్నారు. బ్రేక్ ఇన్స్పెక్టర్లు ట్రాన్స్పోర్ట్ అధికారులు విద్యాశాఖ అధికారులు ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి జిల్లా ఉపాధ్యక్షులు వామరీశ్వర్ సింగ్ జిల్లా నాయకులు దినేష్ నాయక్ పట్టణ బాధ్యులు చంటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులకు ఘన సన్మానం



సూర్యాపేట టౌన్ జూలై 1: ప్రాణాలను నిలబెట్టే మహోన్నత సేవ అందిస్తున్న వైద్యులు సమాజానికి నిజమైన ఆదర్శమని లయన్స్ క్లబ్ హాస్పిటల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, లయన్స్ క్లబ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యాద కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ లయన్స్ కంటి ఆసుపత్రిలో డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ ఊర రామ్మూర్తి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ తోట కిరణ్, డాక్టర్ పెద్దిరెడ్డి మహేష్, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ సుమ, డాక్టర్ యశ్వంత్‌లను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాద కిరణ్ కుమార్ మాట్లాడుతూ, వైద్యులు తమ కుటుంబాలను సైతం పక్కనపెట్టి ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్నారని అన్నారు. వారి నిస్వార్థ సేవలను సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ చికురి కృష్ణ, ట్రెజరర్ మిర్యాల వెంకటేశ్వర్లు, వి.డి.జి.-2 గుడిపూడి వెంకటేశ్వరరావు, ఆర్‌సి తోట శ్యామ్, జెడ్‌సి మిర్యాల సుధాకర్, జిల్లా జాయింట్ సెక్రటరీ బండార్ రాజా, సర్వీస్ చైర్‌పర్సన్ కుమ్మరికుంట్ల లింగయ్య, బీఓపీ సభ్యుడు బైరు వెంకన్న గౌడ్, ఫస్ట్ ఆర్‌సి కొండ సంతోష్, లయన్ సభ్యుడు హరి, జాయింట్ సెక్రటరీ ఫణికుమార్ పాల్గొన్నారు.

## కోఆప్షన్ సభ్యుల నియామకమెప్పుడో...?

- **ఎదురుచూస్తున్న ఆశావహులు.....**



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జులై -01(అక్షరం న్యూస్ )

పంచా యతీలకు ఎన్నికలు జరిగి ఆరు నెలలు గడుస్తున్నా కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ ఊసే లేకుండా పోయింది. ఫలితంగా గ్రామ పంచాయతీల్లో సలహాలు, సూచనలు ఇచ్చే వారు లేక పాలకవర్గాలు నిధుల వినియోగం విషయంలో ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుం టున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయిపాలక వర్గాలు ఏర్పడి ఆరు నెలలు గడిచిన ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడం తో జిల్లా లో నియమించవలసిన కో అప్షన్ సభ్యుల ఎన్నిక నిలిచిపోయింది. గ్రామ అభివృద్ధి కి సలహాదారులుగా ఉండవలసిన వ్యవస్థ ప్రభుత్వ నిర్లక్ష్యం తో కాగితాలకే పరిమితమైనది అని విమర్శలు వ్యక్తమవుతున్నాయి

### ఎన్నిక విధానం ఇలా..

సర్పంచ్, వార్డు సభ్యులు సమావేశమై గ్రామానికి చెందిన ముగ్గురిని కోఆప్షన్ సభ్యులుగా ఎన్నుకుంటారు. ఇందులో ఒకరు పదవి విరమణ చేసిన ఉద్యోగి, లేదా అనుభవఉన్న సినీయర్ సిటిజన్, మరొకరు గ్రామ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి లేదా గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు ఇంకొకరు పంచాయ తీలకు స్థలాలు ఇచ్చిన దాతలు లేదా భారీ గా విరాళాలు ఇచ్చిన దాతలు, గ్రామాభి వృద్ధి కి దోహదపడే ప్రవాస భారతీయులను నియ మించాల్సి ఉంటుంది. ఈ విషయంపై సంబంధిత అధికారిని వివరణ కోరగా పంచా యతీల్లో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు సబం ధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశా లు రాలేదని చెప్పారు. స్పష్టమైన ఆదేశాలు రాగానే కోఆప్షన్ సభ్యుల ఎన్నిక చేపట్టేం దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు

### హోదా, అధికారం, బాధ్యతలు..

కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన వారు పం చాయతీ పాలకవర్గ సమావేశాల్లో పాల్గొని వివిధ అంశాలపై సలహాలు, సూచనలు ఇచ్చే హక్కు ఉంటుంది. వీరికి వార్డు సభ్యుల తో సమానమైన ప్రొటోకాల్, హోదా, గౌరవం దక్కుతుంది. సమావేశాల్లో చర్చించే అవకాశం ఉన్నప్పటికీ, తీర్మానాల ఆమోదంలో మాత్రం ఓటు హక్కు ఉండదు. కేవలం పంచాయతీకి సలహాదారులుగా మాత్రమే వ్యవహరించాల్సి ఉంటుంది. పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధికి సంబంధి చిన ప్రణాళిక రూపకల్పనలో కోఆప్షన్ సభ్యు ల పాత్ర కీలకమవుతుంది...



## ఎన్టిపిసి ఆసుపత్రిలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం





జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

ఎన్టీపీసీ రామగుండం & తెలంగాణ ఆధ్వర్యంలో ధన్వంతరి ఆసుపత్రిలో బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది "బియాండ్ ద మాస్క్" అనే అంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని వైద్యుల సేవలను గుర్తిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సీజీఎం (ఓ అండ్ ఎం) ముకుల్ రాయ్ ముఖ్య అతిథిగా, రామగుండం జీఎం (ఓ అండ్ ఎం) మనీష్ అగర్వాల్ గౌరవ అతిథిగా, రామగుండం ప్రభుత్వ ఆసుపత్రి సీనియర్ ఆర్ఎంఓ డాక్టర్ కృపా బి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధిపతులు, దీప్తి మహిళా సమితి (డీఎంఎస్) ప్రతినిధులు, గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా ముందుగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ నిబద్ధతను చాటారు. అనంతరం చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) అతిథులకు స్వాగతం పలికారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా స్మరించుకునే ప్రముఖ వైద్యుడు డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు అందిస్తున్న విశిష్ట సేవలు, అంకితభావం, త్యాగాలను ప్రతిబింబించే ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విచ్చేసిన మానసిక వైద్య నిపుణుడు వైద్య వృత్తిలో ఒత్తిడి నిర్వహణ, మానసిక ఆరోగ్యం, స్వీయ సంరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ప్రసంగించారు. చివరగా వైద్య సిబ్బంది కోసం వినోదాత్మక, ఉత్సాహాభరిత కార్యక్రమాలు నిర్వహించి వారిని సత్కరించారు. వైద్యుల అంకితభావం, కరుణ, మానవ సేవలను గుర్తిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ సమావేశంలో గుర్తింపు యూనియన్ బి ఎం స్ జనరల్ సెక్రెటరీ సాగర్ రాజు తదితరులు పాల్గొన్నారు.





## వైద్యో నారాయణో హరిః -- నిన్నటి మాట..

- **వ్యాపారమే పరమావధి -- నేటి బాట!**

పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్,/ జూలై 01 / అక్షరం న్యూస్ ప్రతినిధి,

(మహమ్మద్ యూసుఫ్ అలీ )

మానవ రూపంలో ఉన్న దేవుడు ఎవరు? అని ఎవరిని అడిగినా వచ్చే ఒకే ఒక్క సమాధానం వైద్యుడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగిని మృత్యువు నోటి నుండి రక్షించి, పునర్జన్మ ప్రసాదించే దాక్టర్లను సమాజం భగవంతుడితో సమానంగా పూజించింది. కానీ, నేడు ఆ పవిత్రమైన వైద్య రంగం కార్పొరేట్ శక్తుల చేతుల్లో చిక్కుకుని, లాభార్జనే ధ్యేయంగా నడుస్తున్న ఒక "దోపిడీ వ్యాపారం"గా మారిపోవడం అత్యంత విచారకరం. దేవుడిలా ఉండాల్సిన వైద్య విధానం, కొన్ని చోట్ల రాక్షసత్వానికి నిలువెత్తు రూపంగా మారుతోంది. ఒకప్పుడు వైద్యం అనేది ఒక సేవ. కానీ నేడు అది ఒక పెద్ద పరిశ్రమగా రూపాంతరం చెందింది. రోగి ఆసుపత్రి గేటు దాటి లోపలికి అడుగుపెట్టిన క్షణం నుండి, అతడొక మనిషిగా కాకుండా, ఒక 'కస్టమర్' లాగా, డబ్బులు గుంజడానికి పనికొచ్చే ఒక 'వనరు' లాగా చూడబడుతున్నాడు. కార్పొరేట్ ఆసుపత్రులు దాక్టర్లకు నిర్దేశిస్తున్న "టార్గెట్లు", కమీషన్ల సంస్కృతి ఈ దుస్థితికి ప్రధాన కారణం. వైద్య రంగంలో చోటుచేసుకుంటున్న కొన్ని నగ్న సత్యాలను పరిశీలిస్తే గుండె తరుక్కుపోతుంది. అత్యంత అమానవీయమైన, దారుణమైన విషయం ఏమిటంటే రోగి మరణించాడని తెలిసి కూడా, ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెంటిలేటర్ మీద ఉంచి చికిత్స చేస్తున్నట్లు నటించడం. అనేక నగరాల్లో ఇటువంటి ఘటనలు వెలుగుచూశాయి. ఊపిరి ఆగిపోయిన శవాన్ని ఐసీయూ లో ఉంచి, రోజుకు లక్షల్లో బిల్లులు వేస్తూ, తీరా డబ్బులన్నీ కట్టించుకున్నాక.. "ఇప్పుడే గుండె ఆగిపోయింది" అని చేతులు ఎత్తేసే రాక్షసత్వం కొన్ని ఆసుపత్రుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. మాధ్యమాల ద్వారా జనానికి తెలియడం ఆ తర్వాత పక్షాలు, ప్రతిపక్షాలు, వత్రికలు, టి.వి. టి బెట్లు నాలుగు రోజులపరకు హోరెత్తి, ఆ తర్వాత ఇదంతా మామూలు విషయమే అన్నట్లుగా విషయాన్ని పక్కన పెట్టేయడం తో ఇంకా ఆయా ఆసుపత్రులు యధేచ్చగా నడుస్తున్నాయి. పాపం చనిపోయిన వ్యక్తి పిల్లలు, భార్య, వారి భవిష్యత్తు బంధువుల శోకం అన్నీనిశ్శబ్దంగా నిస్సహాయంగా ఏడ్చి,ఏడ్చి,మౌనం దాల్చాయి. ఇలా ఎన్ని జీవితాలు మౌన రోదన తో ఈ దోపిడీ వ్యవస్థ కు బలయ్యారో పట్టించుకునే వారు లేరు. శోకాన్ని కూడా క్యాష్ చేసుకుంటే ఈ ప్రవృత్తి వైద్య రంగానికే ఒక నల్లటి మచ్చ. ఈ విషయాలే కాకుండా వైద్య రంగ దోపిడి ఇంకా ఎన్నో రకాలుగా సాగుతుంది. చిన్న తలనొప్పి లేదా కడుపునొప్పితో వెళ్తే చాలు. ఎమ్మారై సిటీ స్కాన్, వందల రకాల రక్త పరీక్షలు రాయడం సర్వసాధారణమైపోయింది. డయాగ్నస్టిక్ సెంటర్ల నుండి వచ్చే కమీషన్ల కోసం రోగుల రక్తాన్ని, జేబులను పిండేస్తున్నారు. కాన్పుల విషయానికి వస్తే, నేడు సహజ ప్రసవాలు అరుదైపోయాయి. ముహూర్తాల పేరుతోనో, లేక ఆసుపత్రికి ఎక్కువ డబ్బులు వస్తాయనో.. 80 శాతానికి పైగా సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారు. అలాగే, చిన్న గుండెనొప్పి అనగానే భయపెట్టి, అవసరం లేకపోయినా స్టెంట్లు వేయడం, బైపాస్ సర్జరీలు చేయడం లాంటివి వ్యాపారంలో భాగమైపోయాయి. ఇక్కడ తప్పు కేవలం వైద్యులదే అనలేం. కార్పొరేట్ యాజమాన్యాలు దాక్టర్లపై పెట్టే ఒత్తిడి అటువంటిది. ప్రతి నెల ఇన్ని సర్జరీలు చేయాలి, ఇంత ఆదాయం తీసుకురావాలి అని టార్గెట్లు విధించడంతో.. కొంతమంది వైద్యులు తమ వృత్తి ధర్మాన్ని పక్కన పెట్టి, యాజమాన్యాల చేతిలో కీలుబొమ్మలుగా మారి రాక్షసత్వానికి ఒడిగడుతున్నారు. డబ్బు సంపాదించడం తప్పు కాదు, కానీ ప్రాణాల మీద వ్యాపారం చేయడం క్షమించరాని నేరం. రోగి ప్రాణం కంటే, ఆసుపత్రి బిల్లు ముఖ్యం అనుకునే రోజులు పోవాలి. ప్రభుత్వాలు వైద్య రంగంపై గట్టి నిఘా ఉంచాలి. కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీని అరికట్టేలా కఠినమైన చట్టాలు తీసుకురావాలి. ప్రభుత్వ వైద్య విధానాన్ని బలోపేతం చేయాలి. అన్నిటికంటే ముఖ్యంగా, వైద్యులు కూడా తమ పవిత్రమైన వృత్తిని, ప్రమాణాలను గుర్తుచేసుకోవాలి. అలా జరిగినప్పుడే అప్పుడే హ్యాపీ డాక్టర్స్ డే అని మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియ చేయడం లో అర్థం ఉంటుంది. "వైద్యో నారాయణో హరిః" అనే నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత నేటి వైద్య సమాజంపై ఉంది.



## లయన్స్ క్లబ్ పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక

- **నూతన అధ్యక్షుడిగా పెండ్యాల గౌతం చారి.**

మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జులై 1/అక్షరం న్యూస్ -:

మందమర్రి లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు పెండ్యాల గౌతమ్ చారి, ట్రెజరర్ బుర్ర ఆంజనేయులు, డైరెక్టర్ బింగి రాజన్న, డైరెక్టర్ కొక్కుల మధు లను ఎన్నుకున్నట్లు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సొత్కు సుదర్శన్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సభ్యులు బుధవారం మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుని మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు మాట్లాడుతూ, సమాజ సేవలో లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మందమర్రి లయన్స్ క్లబ్ నూతన



అధ్యక్షుడిగా ఎన్నికైన పెండ్యాల గౌతమ్ చారి, ట్రెజరర్‌గా ఎన్నికైన బుర్ర ఆంజనేయులు, డైరెక్టర్లుగా ఎన్నికైన బింగి రాజన్న, కొక్కుల మధు లకి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారి పదవీకాలంలో క్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు.

## ఇంటింటికి తిరిగి సర్ ఫారాలను అందజేయాలి...

- కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ బి ఎల్ ఓ ల సూపర్వైజర్ ధనావత్ మోహన్ బాబు నాయక్.



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 01 / : బుధవారం రోజు ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, మరియు డిసిసి అధ్యక్షులు, బీర్ల ఐలన్న ఆదేశాను సారం ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండల కేంద్రంలోని జేతురాంతండా 71 వ భూత్ లో "నునావత్ భాస్కర్ నాయక్" అధ్యక్షతన ఇంటింటికి తిరిగి 2026 ఫారాలను అందజేయాలని బిఎల్ఓ లకు సూచించారు. ఈ కార్యక్రమం లో బి ఎల్ ఓ ల సూపర్వైజర్ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ పారాలను పంపిణీ చేశారు. బిఎల్ఏలు ఇంటింటికి తిరిగి ఓటర్లకు తలెత్తే అనుమానాలను, ఓటర్లకు కావాల్సిన సమాచారాన్ని అందించాలని ఎన్యుమరేషన్ లో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని, ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నేనావత్ బాలునాయక్, మరియు తండా గ్రామ మహిళలు, బి ఎల్ ఓ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

## మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి బీజన బాలమణి భాస్కర్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 01 / : బుధవారం రోజు ఆలేరు పట్టణంలో డాక్టర్స్ డే పురస్కరించుకొని మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి బీజన బాలమణి భాస్కర్ ఆలేరు పట్టణం ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రభాకర్ ని,డాక్టర్ ప్రతాప్ రెడ్డి ని,ఆలేరు పట్టణ ప్రభుత్వ హాస్పిటల్ సూపరిండెంట్ స్వప్న రాథోడ్ ని,ప్రభుత్వ వైద్యుడిని శాలువాలు కప్పి వారిని సన్మానించి, వారి రోగులకు ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మరియమ్మ , మార్కు యాట శివ,పస్తం ఆంజనేయులు, జూకంటి సంపత్, మల్లెల సరిత శ్రీకాంత్ , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర్ రెడ్డి పాల్గొన్నారు...

## నీటి సమస్యలు తీర్చడానికి కృషి చేసిన ఆలేరు మున్సిపల్ చైర్మన్ శ్రీమతి బీజన బాలమణి భాస్కర్



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై ౧1 / : బుధవారం రోజు ఆలేరు పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఁ మార్కండేయ కాలనీ ప్రజలు చాలా రోజుల నుంచి నీటి సరఫరా సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆలేరు మున్సిపల్ చైర్మన్ శ్రీమతి బీజన బాలమణి భాస్కర్ దృష్టి తీసుకురాగా, ప్రభుత్వ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో బుధవారం రోజు స్థానిక కాలనీవాసుల బోరు లీజుకు తీసుకొని నూతన మోటర్ బిగించి కాలనీవాసుల నీటి సమస్యలు తీర్చుడానికి కృషి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ , కౌన్సిలర్లు పస్తం ఆంజనేయులు, పాషికంటి సంపత్ గారు,జూకంటి సంపత్ ,ఆలేరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాగర్ రెడ్డి ,కాలనీవాసులు పాల్గొన్నారు. చాలా సంవత్సరాల నుండి నీటి సరఫరా విషయంలో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు సమస్యలు తీర్చిన చైర్మన్ కి, పాలకవర్గానికి ,కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు...

### అశ్వారావుపేట ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని

# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్





- ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి..
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ అంకిత్.

భద్రాద్రి కొత్తగూడెం/ అశ్వారావుపేట / జులై 1 / అక్షరం న్యూస్ –:



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డాక్టర్లు, ఇతర సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి వారి హాజరు, విధుల నిర్వహణపై ఆరా తీశారు. ఆసుపత్రి సిబ్బంది ఎన్ని షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.అనంతరం



ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రసూతి వార్డులో చికిత్స పొందుతున్న మహిళల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. డయాలసిస్ వార్డును సందర్శించి మూడు షిఫ్టుల్లో రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు వైద్యులు వివరించారు. జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవల నాణ్యత, మందుల లభ్యత, వైద్యులు, సిబ్బంది స్పందనపై ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రోగులతో



మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తదుపరి అశ్వారావుపేట గిరిజన బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని వార్డెన్‌కు సూచించారు. వసతి గృహంలో పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక



సదుపాయాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వసతి గృహం భవనం పైకప్పు నుంచి వర్షపు నీరు లీకేజీ అవుతున్న విషయాన్ని కలెక్టర్ గమనించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే పైకప్పుకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత ఇంజినీరింగ్



అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణంలో వసతి కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు.

### 07 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 948.478 కిలోల

# గంజాయిని నిర్వీర్యం చేసిన జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం/ జూలై 1 / అక్షరం న్యూస్ –:

న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 07 కేసులకు సంబంధించిన 948.478 కిలోల గంజాయిని తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలోని ఎం/ఎస్ ఏడబ్ల్యూఎం కన్సల్టింగ్ లిమిటెడ్ ప్రాంగణంలో పూర్తిగా నిర్వీర్యం చేసి బూడిద చేసినట్లు జిల్లా ఎస్పీ, డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ రోహిత్ రాజు తెలిపారు.నిర్వీర్యం చేసిన గంజాయి విలువ సుమారు రూ.4 కోట్ల 74 లక్షలు ఉంటుందని తెలిపారు.నిర్వీర్య ప్రక్రియలో పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేసుకోవడమే కాకుండా తల్లిదండ్రుల ఆశలను ఆవిరి చేస్తున్నారని పేర్కొన్నారు,





చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారుజిల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతూ గంజాయి పై ఉక్కు పాదం మోపుతున్నారని తెలియజేశారు.మాదక ద్రవ్యాల క్రయ విక్రయాల గురించి తెలిసినట్లయితే సమాచారాన్ని పోలీస్ వారికి అందించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ మెంబర్స్ కొత్తగూడెం సబ్ డివిజన్ డిఎస్పి ఆదినారాయణ, భద్రాచలం సబ్ డివిజన్ డిఎస్పి అరుణ్ కుమార్, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్

ఓదెల/ పెద్దపల్లి జులై 01(అక్షరం న్యూస్)

ఓదెల మండలంలోని లంబాడితండ గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ప్రారంభించారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ లంబాడి తండా గ్రామానికి 20 లక్షలతో గ్రామపంచాయతీ భవనాని ఈరోజు ప్రారంభించుకోవడం జరిగిందని అదేవిధంగా అంతర్గత సిసి రోడ్లు కు శంకుస్థాపన చేశామని గ్రామాల సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వివరించారు అలాగే తండవాసులు కోరిన మేరకు ఈ తండాను మల్లికార్జున తండాగా ఎప్పటికీ పిలవాలని అన్నారు ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి 15 కోట్ల రూపాయలు మంజూరు చేశామని భక్తుల



సౌకర్యం కోసం 20 కాటేజ్ రూమ్స్ నిర్మాణ పనులు చేపట్టడానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని అన్నారుఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుగులోత్ నిమ్మ నాయక్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పిట్టల రవికుమార్ పలు గ్రామాల సర్పంచ్ లు తంగేళ్ల నరసింహారెడ్డి రాగిడి మంగా శ్రీనివాస్ ఆవాల ప్రసాద్, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు. పడాల రాజు పుప్పాల శంకర్ , కుంచం మల్లయ్య, నీర్ల శ్రీనివాస్ చొప్పరి రాజయ్య బైరి రవి ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు రెడ్డి రజనీకాంత్ ఉప సర్పంచ్ గుగులోత్ లింగేష్, గుగులోత్ పర్శ, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## ఫుట్ పాత్ ల ఆక్రమణలు తొలగించాలి

- ఫుట్‌పాత్ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్.
- మున్సిపల్ కమిషనర్‌కు జేబీపీ నేత కామేష్ ఫిర్యాదు.



భద్రాద్రి కొత్తగూడెం /

కొత్తగూడెం / జూలై 1 అక్షరం న్యూస్ -: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయని,ఏంజీ రోడ్డులో ప్రభుత్వ ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ బుధవారం మున్సిపల్ కమిషనర్ సుజాతకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.ఆయన మాట్లాడుతూ ఏంజీ రోడ్డులోని ఇంటి నెంబర్లు 6-2-141, 6-2-142కు చెందిన షాప్ యజమాని ఇటీవల చేపడుతున్న నిర్మాణాల్లో అవసరమైన అనుమతులు లేకుండానే ప్రభుత్వ ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి సెట్ బ్యాక్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు.అంతేకాకుండా భవనం పక్కన ఉన్న స్థలంలో కూడా అక్రమంగా మెట్లు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాన రహదారిపై ఇలాంటి నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టినా నోటీసులు జారీ చేసే అధికారులు,కొంతమంది విషయంలో మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.ఫుట్‌పాత్‌ల ఆక్రమణల వల్ల పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.వెంటనే స్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో లిజిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, పట్టణ అధ్యక్షుడు గజ్జల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయస్థానానికి తాళం



ఓదెల/ పెద్దపల్లి జులై.01(అక్షరం న్యూస్)

అద్దె చెల్లించడం లేదని న్యాయస్థానాని కె తాళం వేసిన సంఘటన ఓదెలలో చోటు చేసుకుంది ఓదెలలో జ్యుడీషియల్ కోర్టుకు తాళం వేసిన భవన యజమాని ముంజల మధు. 2025 ఏప్రిల్ నుండి అద్దె బకాయిలు ఇవ్వలేదని ఆవేదనతో . అద్దె కట్టలేదని కోర్టుకే తాళం వేసిన యజమాని : అద్దె బకాయిలు చెల్లించడం లేదని ఆరోపిస్తూ భవన యజమాని ఏకంగా జ్యుడీషియల్ కోర్టు భవనానికే తాళం వేసిన విచిత్ర ఘటన ఓదెల మండల కేంద్రంలో జరిగింది.న్యాయం అందించాల్సిన కోర్టు భవనానికే తాళం పడటంతో స్థానికంగా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఓదెల మండల కేంద్రంలో తన స్వంత భవనాన్ని జ్యుడీషియల్ కోర్టు నిర్వహణ కోసం అద్దెకు ఇచ్చారు. కాగా, ఈ కోర్టు భవనం 2025 ఏప్రిల్ 19వ తేదీన అధికారికంగా ప్రారంభమైంది. అయితే కోర్టు ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు ఒక్క నెల అద్దె కూడా ప్రభుత్వం లేదా సంబంధిత శాఖ అధికారులు చెల్లించలేదని ఆయన బహిరంగంగా ఆరోపించారు.అద్దె బకాయిల విషయమై తాను పలుమార్లు జిల్లా కోర్టు ఉన్నతాధికారులను కలిసి, అద్దె చెల్లించాలని వేడుకున్నట్లు మధు తెలిపారు. అయితే, బిల్లుల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, అది పూర్తయిన వెంటనే బకాయిలు చెల్లిస్తామని చెబుతూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయినందునే, నిరసనగా ఈరోజు కోర్టు భవనానికి తాళం వేయాల్సి వచ్చిందని యజమాని స్పష్టం చేశారు.అద్దె చెల్లిస్తామని సివిల్ జడ్జి హామీ ఇవ్వడంతో సమ్మతించిన భవన యజమాని యధావిధిగా కొనసాగుతున్న కోర్టు కార్యకలాపాలు

# వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్ల సేవలు సమాజానికి ఆదర్శం





- డాక్టర్స్ డే, సీఏ డే సందర్భంగా అశ్వరావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ ఘన సన్మానం.

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వరావుపేట / జూలై 1 / అక్షరం న్యూస్ -: డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా అశ్వరావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రముఖ వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లను ఘనంగా సన్మానించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంచర్ల భాస్కరరావు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సేవలను కొనియాడారు.

### వైద్యులు, సీఏల సేవలు అమూల్యం.

ఈ సందర్భంగా కంచర్ల భాస్కరరావు మాట్లాడుతూ సమాజానికి వైద్యులు అందిస్తున్న ఆరోగ్య సేవలు, చార్టర్డ్ అకౌంటెంట్లు అందిస్తున్న ఆర్థిక సేవలు అమూల్యమైనవని అన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన వైద్యుల త్యాగం చిరస్మరణీయమని కొనియాడారు.

### ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా సీఏలు.

దేశ ఆర్థిక వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించడంలో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర కీలకమని, వారి సేవలు అన్ని రంగాలకు ఎంతో అవసరమని భాస్కరరావు పేర్కొన్నారు.

### పాల్గొన్న ప్రముఖులు.

కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సభ్యులు, పట్టణ ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.



# కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకాలు పేద కుటుంబాలకు కొండంత అండ





- ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్నవారికి వరం.
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా నిరంతరం కృషి.
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.
- రూ.2.17కోట్ల విలువచేసే సంక్షేమ చెక్కులను లబ్దిదారులకు అందించిన ఎమ్మెల్యే.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం /

కొత్తగూడెం / జులై 1 / అక్షరం న్యూస్ -: పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం కొత్తగూడెం క్లబ్బులో కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకాలతో పాటు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ కింద 144 మంది లబ్ధిదారులకు రూ. 1,60,00,704 విలువగల చెక్కులను, అలాగే నియోజకవర్గ పరిధిలోని మరో 143 మంది లబ్ధిదారులకు రూ. 57,34,500 విలువచేసే సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆడబిడ్డల పెళ్లిళ్లకు తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకాలు పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క ఆడబిడ్డ పెళ్లి ఆగిపోకూడదనేదే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. అదేవిధంగా, అనారోగ్యం మరియు ఆపద కాలంలో వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్బంది పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరంగా మారిందని, ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతోందని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులందరూ ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరబాబు, సొసైటీ చర్మం హనుమంతరావు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, తహసిల్దార్లు పుల్లయ్య, కృష్ణ ప్రసాద్, ప్రసాద్, కార్పొరేటర్లు, నాయకులు వాసిరెడ్డి మురళీ, సర్పంచులు పాల్గొన్నారు.

# భక్తులపై తేనెటీగల దాడి





ఓదెల పెద్దపల్లి జులై.01అక్షరం న్యూస్

భక్తులపై తేనెటీగల దాడి 108 అంబులెన్స్లు హాస్పటల్ తరలించి చికిత్స అందిస్తున్న సంఘటన చోటు చేసుకుంది వివరాలకు వెళ్తే

ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు బోనాలు. వంట చేసే క్రమంలో కట్టెల పొగ ఎక్కువ రావడంతో పైన ఉన్న తేనె తిట్టకు తగిలి బుధవారం తేనెటీగలు భక్తులపై దాడి చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దర్శనం కోసం వచ్చిన భక్తులపై ఒక్కసారిగా తేనెటీగల గుంపు విరుచుకుపడటంతో ఆలయ ప్రాంగణం క్షణాల్లోనే భయాందోళనకు గురైంది. భక్తులు ప్రాణభయంతో పరుగులు తీయడంతో ఆలయ పరిసరాలు గందరగోళంగా మారాయి.

కొంతమంది భక్తులు పరదలు కప్పుకొని పరుగులు తీయడం మరికొందరు రోడ్డుపై తనకున్నటువంటి వస్త్రాలను కప్పుకొని ప్రాణ భయంతో గత గతలాడిపోయారు కొంతమంది పై విరుచుకు పడడంతో పరిస్థితి తీవ్రంగా మారింది

కరీంనగర్ నుంచి కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో పాటు అక్కడే ఉన్న పలువురిపై తేనెటీగలు ఒకేసారి దాడి చేశాయి. ఈ ఘటనలో ఆరు నెలల పసికందుతో సహా సుమారు 20 మంది గాయపడినట్లు సమాచారం. చిన్నారిపై కూడా తేనెటీగలు దాడి చేయడంతో అక్కడున్న వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ నరేష్, పైలట్ రాజేందర్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం క్షతగాత్రులను కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు.

తేనెటీగల దాడికి గల కారణాలపై ఆలయ అధికారులు ఆరా తీస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని భక్తులు అధికారులను కోరుతున్నారు.

## కృత్రిమ మేథతో కొత్త పుంతలు తొక్కుతున్న వైద్యం

- డాక్టర్స్ డే వేడుకలో మందమర్రి జి.ఎం ఎస్. రాధాక్రిష్ణ.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూలై 01/ అక్షరం న్యూస్ –:

వైద్య శాస్త్రానికి కృత్రిమ మేధ తోడవడంతో మానవ ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, వస్తున్నాయని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ అన్నారు. బుధవారం డాక్టర్స్ డే పురస్కరించుకుని కేకే 1 డిస్పెన్సరీ లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైద్య శాస్త్రం శాఖోప శాఖలుగా విస్తరిస్తోందని,గతంలో లొంగని రోగాలు సైతం లొంగివస్తున్నాయన్నారు. ఏ.ఐ.ఎంత విశ్లేషించినా చివరకు డాక్టర్ ను సంప్రదించమనే చెప్తుందని అదే సమాజంలో డాక్టర్ కు ఉన్న ప్రాధాన్యత అని అన్నారు. సింగరేణిలో ఆబ్సెంటిజం చేసే కార్మికులను డాక్టర్లు కౌన్సిలింగ్ చేసి రెగ్యులర్ గా విధులు నిర్వహించేలా ప్రయత్నించాలన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఆసుపత్రి సిబ్బంది ఓపికతో కార్మికులకు వైద్య సేవలు అందించాలని ఐ ఈ డి ఇంజనీర్ కిరణ్ అన్నారు.సమాజంలో డాక్టర్ల సేవలు మరువలేనివి అని గుర్తింపు కార్మిక సంఘం కార్యదర్శి సలంద్ర సత్యనారాయణ తెలిపారు.అందుకే వైద్యుడే నారాయణుడు అనే నానుడి ఉందన్నారు.ఈ సందర్భంగా సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ జారీ చేసిన ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని డాక్టర్ పాక శ్రీజ కు జీ.ఎం రాధాకృష్ణ అందజేశారు. అదే విధంగా కేకే డిస్పెన్సరీలో స్టాఫ్ నర్స్(కాంట్రాక్టు)గా పనిచేసిన నక్క సుష్మ ములుగు ప్రభుత్వాసుపత్రిలో స్టాఫ్ నర్స్ గా సెలెక్ట్ అయింది.ఈ సందర్భంగా ఆమెను జీ.ఎం.,అతిథులతో పాటు ఆసుపత్రి సిబ్బంది సన్మానించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వర్ రావు,మెడికల్ అధికారి డాక్టర్ హుస్సేన్ ఖాన్ అర్ఫాత్ తదితరులు పాల్గొన్నారు.

## సిటిజన్ న్యూస్ ఛానల్ వారి సౌజన్యంతో విద్యార్థిని, విద్యార్థులకు పాటల పోటీలు

- సిటిజన్ న్యూస్ ఛానల్ అధినేత డి. రవి ప్రసాద్



వనపర్తి టౌన్ అక్షరం ప్రతినిధి: వనపర్తి టౌన్ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కళలు అంతరించిపోతున్న తరుణంలో యువత చెడు మార్గాన్ని ఎంచుకోవడం జరుగుతుంది, చెడు మార్గాన్ని ఎంచుకోవడం వలన యువతలో అసాంఘిక కార్యక్రమాలు, మత్తు పదార్థాలు, వ్యసనాలకు బానిసలై సరైన అవగాహన లేకుండా పోయిందని రవి ప్రసాద్ వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యువత సన్మార్గంలో నడిచేందుకు ముందు తరాలకు బాటలు వేసే విధంగా యువతను మేల్కొల్పే కార్యక్రమాలు చేపడితే మార్పు అనేది వస్తుంది, ఆరంభం ఒక్క అడుగుతోనే మొదలవుతుంది. యువతలో అసాంఘిక కార్యక్రమాలను రూపుమాపుటకు విద్యార్థిని, విద్యార్థులలో సృజనాత్మకను వెలికితీస్తూ విజ్ఞానం, వినోదం, దేశభక్తి, సామాజిక అంశాలపై ఆసక్తి పెంపొందించడానికి వారిలోని మానసిక ఒత్తిడిలను తొలగించే సంకల్పంతో సిటిజన్ న్యూస్ ఛానల్ చేపట్టిన స్వరాంజలి కార్యక్రమాన్ని ఆదరించి సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్వరాంజలి కార్యక్రమంలో విద్యార్థిని , విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని తమలో ఉన్న ప్రతిభను చాటుకోవాలని, తమ నైపుణ్యాన్ని గుర్తించి మండల, తాలూకా, జిల్లా స్థాయి ప్రముఖులచే బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకొని మీలో ఉన్న ప్రతిభ కనబరిచి, అంతరించిపోతున్న కళలకు ప్రాణం పోయాలని సిటిజన్ న్యూస్ ఛానల్ అధినేత పేర్కొన్నారు.

## నిబద్ధతతో పనిచేసిన రాజన్న కు ఘనమైన వీడ్కోలు



ఓదెల /పెద్దపల్లి జులై 01(అక్షరం న్యూస్)

ఓదెల మండలంలోని కనగర్తి దాసరి పద్మా హన్మయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఆఫీస్ సభర్డినేట్ గా 40 ఏళ్ల సర్వీసు అనంతరం బుధవారం పదవీ విరమణ పొందారు, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశం లో గ్రామ పాలక వర్గం మాజీ మాజీ జెడ్పిటిసి గంట రాములు హాజరయ్యారు ఈ సందర్భంగా రాజన్నకు రాజన్న సతీమణికి ఘనంగా శాలువులతో సన్మానం చేశారు ఈ జడ్పిటిసి మాట్లాడుతూ తాను. ఎంపీపీగా ఉన్న కాలం లో తానతో ఉన్న అనుభవాన్ని అనుబంధాన్ని గుర్తు చేస్తూ ఆయన సేవలను కొనియాడారు,గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం లో పాల్గొని మండలం లో చిన్న తనం లో ఆయన చేసిన సహాయ సహకారాలు గుర్తు చేస్తూ కొనియాడారు,ఎంఈఓ రమేష్ మాట్లాడుతూ రాజన్న నోట్లో నాలుక లాగా మెదిలిన మనిషి అని అలాంటి రాజన్న పదవీ విరమణ పొందడం కొంత బాధిస్తుంది అని ఐనా తన మిగతా జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులు గ్రామస్తుల మధ్య గణమైన వీడ్కోలు తెలుపుతూ రాజన్న ను ఇంటి దాకా సంగణంపి వీడ్కోలు పలికారు.



# సింగరేణి గడ్డ మరోసారి పోరాటాల గడ్డగా మారింది





- జేపీసీ ఆధ్వర్యంలో కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముట్టడి విజయవంతం.
- వేలాది కార్మికులతో మార్మోగిన డిమాండ్ల డే.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జులై 1 / అక్షరం న్యూస్ –:

జేఏసీ (ఏఐటీయుసి, ఐ ఎన్ టీ యు సి, సి ఐ టి యు, హెచ్ ఎం ఎస్) ఆధ్వర్యంలో బుధవారం ఉదయం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద నిర్వహించిన మహా ధర్నా, ముట్టడి కార్యక్రమం చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. సింగరేణి అన్ని ఏరియాల నుంచి వేలాది మంది కార్మికులు, నాయకులు భారీగా తరలివచ్చి ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. "డిమాండ్ల డే"గా నిర్వహించిన ఈ పోరాట కార్యక్రమం సింగరేణి కార్మిక ఐక్యతకు, ఉద్యమ స్ఫూర్తికి మరోసారి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, కార్మికుల సహనాన్ని బలహీనతగా భావిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికులకు న్యాయంగా రావాల్సిన హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. వెంటనే 12వ వేజ్ బోర్డును ఏర్పాటు చేసి వేతన సవరణ పూర్తి చేయాలని, కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలు మరింత ఉధృతమవుతాయని స్పష్టం చేశారు.అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల శ్రమతో కోట్లాది రూపాయల లాభాలు ఆర్జిస్తున్న పాలకులు, అదే కార్మికులకు రావాల్సిన హక్కులను నిరాకరించడం దారుణమని మండిపడ్డారు.12వ వేజ్ బోర్డు ఏర్పాటు విషయంలో కొనసాగుతున్న జాప్యాన్ని వెంటనే నివారించాలని, నాలుగు లేబర్ కోడ్స్ పేరుతో శ్రమ చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను కార్మిక ఉద్యమం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. అవసరమైతే సమ్మెలు, ముట్టడులు, నిరవధిక ఆందోళనలతో ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని దిగివచ్చేలా చేస్తామని హెచ్చరించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమం ఆగదని నాయకులు స్పష్టం చేశారు. సింగరేణి చరిత్రలో కార్మికులకు లభించిన ప్రతి హక్కు ఉద్యమాల ద్వారానే సాధించబడిందని గుర్తు చేస్తూ, ఈసారి కూడా కార్మికుల ఐక్యతతో మరో చారిత్రాత్మక విజయాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్మికుల ఐక్యశక్తి ముందు కార్మిక వ్యతిరేక విధానాలు నిలవవని, అవసరమైతే మరింత ఉధృత కార్యాచరణ చేపడతామని ప్రకటించారు. ఈ మహా ధర్నా, ముట్టడి కార్యక్రమంతో సింగరేణి కార్మిక లోకం మరోసారి తన పోరాట పటిమను చాటిచెప్పింది. "12వ వేజ్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి -- నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి" అనే నినాదాలతో కొత్తగూడెం హెడ్ ఆఫీస్ పరిసరాలు మార్మోగాయి. డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమ జ్వాల ఆరదని, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని జేపీసీ నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె. సారయ్య, వీరభద్రయ్య, వై.వి.రావు, ముస్కె సమ్మయ్య, వంగ వెంకట్ , బ్రాంచ్ కార్యదర్శులు మల్లికార్జున్, రమణమూర్తి, నజీర్ మేకల ఈశ్వర్, సుధాకర్, గట్టయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్, త్యాగరాజన్, లక్ష్మారెడ్డి, ఆల్బర్ట్, పీతంబరం, రజాక్, సీఐటీయూ నాయకులు మంద నర్సింహారావు, రాజిరెడ్డి, విజయగిరి శ్రీనివాస్, హెచ్‌ఎంఎస్ నాయకులు కృష్ణ ప్రసాద్, ఆంజనేయులు, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో కార్మికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






# 'ప్రతి ఇంటికి పట్టా.. ప్రతి కుటుంబానికి ఇల్లు' నినాదంతో పోరుబాట





- పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేసేవరకు ఉద్యమం ఆగదు.
- ఇండ్లు కూల్చివేత చర్యలను పేదలపక్షాన ప్రతిఘటిస్తాం.
- కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో స్థలాలు క్రమబద్ధీకరించి హక్కు కల్పించాలి.
- ఇండ్లు, ఇండ్లస్థలాలకోసం వామపక్షాలు చేపట్టిన కలెక్టరేట్ ధర్నా సక్సెస్..భారీగా తరలివచ్చిన జనం.
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం /కొత్తగూడెం / జులై 1 / అక్షరం న్యూస్ –: 'ప్రతి ఇంటికి పట్టా.. ప్రతి కుటుంబానికి ఇల్లు' అనే నినాదంతో లాల్ జెండా పార్టీలు ప్రారంభించిన పోరుబాట, లక్ష్యం నెరవేరేవరకు ఆగబోదని, పేదలకు గూడు కల్పించేవరకు పాలకులకు కంటిమీద కునుకులేకుండా చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు అన్నారు. సిపిఐ, సిపిఎం, న్యూ డిమోక్రసీ, మాస్ లైన్ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వామపక్షాల నాయకులు, కార్యకర్తలు, ఇండ్లు లేని వేలాది మంది పేదలు భారీ సంఖ్యలో కలెక్టరేట్‌కు తరలివచ్చి నాలుగుగంటలపాటు ఉధృతంగా ధర్నా కొనసాగించారు. ధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరైన కూనంనేని ప్రజనుద్దేశించి మాట్లాడారు. నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేసేవరకు వామపక్షాల ఆధ్వర్యంలో సాగే ఈ ప్రజా ఉద్యమం ఎంతమాత్రం ఆగదని స్పష్టం చేశారు. కొత్తగూడెం పట్టణ పరిధిలో జీవో నెంబర్ 76ను తక్షణమే పూర్తిస్థాయిలో అమలు చేసి, అర్హులైన నిరుపేదలందరికీ పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాల్వంచ పరిధిలోని జీవో నెంబర్లు 444, 999, 817, 727, 410 పరిధిలో దశాబ్దాలుగా నమ్ముకుని ఉన్న స్థలాలను తక్షణమే రెగ్యులరైజ్ చేసి అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం సాయిబాబు మాట్లాడుతూ పేదలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇండ్ల కూల్చివేత చర్యలను తక్షణమే మానుకోవాలని, ప్రభుత్వ నిరంకుశ కూల్చివేతలను పేద ప్రజలందరూ ఐక్యంగా ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పేదలు ఇండ్ల స్థలాలను తక్షణమే క్రమబద్ధీకరించి వారికి చట్టబద్ధమైన హక్కు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదలు నిర్మించుకున్న ఇండ్లకు వెంటనే ఇంటి నెంబర్లు జారీ చేయాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటి కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు తక్షణమే అప్పగించాలని డిమాండ్ చేశారు. న్యూ డిమోక్రసీ జిల్లా నాయకులూ గౌని నాగేశ్వరరావు, మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్లను, ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, సరెడ్డి పుల్లారెడ్డి, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఎం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, వామపక్ష పార్టీల జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, ఎస్ డి సలీం, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, పూర్ణచందర్ రావు, కంచర్ల జమలయ్య, మున్నా లక్ష్మీకుమారి, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, రాహుల్, ఫహీమ్, ఎం జ్యోతి, లిక్కి బాలరాజు, బ్రహ్మచారి, రేపాకులా శ్రీనివాస్, తుపాకుల నాగేశ్వరరావు, ఎం సతీష్, కుంజా కృష్ణ, పెద్దబోయిన సతీష్, ప్రభాకర్, భాస్కర్, వీరభద్రం, శివ, కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## బుధవారం రోజున పలు కార్యక్రమంలు నిర్వహించినలయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి సభ్యులు

- వాకర్స్ కి మధుమేహం పై అవగాహనా కార్యక్రమం
- డాక్టర్స్ డే నిర్వహణ
- పోస్టల్ డే సందర్బంగా సిబ్బందికి సన్మానం




చొప్పదండి /కరీంనగర్,జులై 01 (అక్షరం న్యూస్ )
లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి ఆధ్వర్యంలో బుధవారం రోజున ఉదయం వాకర్స్ గ్రౌండ్ లో వాకర్స్ కి మధుమేహం పై అవగాహన కల్పించి వారికి మధుమేహం పరీక్షలు నిర్వహించారు.అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా ప్రాథమిక ప్రభుత్వ వైద్యశాల(హాస్పిటల్) చొప్పదండిలో జరపారు.ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా చొప్పదండి మున్సిపాలిటీ చైర్పర్సన్ వడ్లురి సరిత హాజరు అయినారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి సమాజంలో ప్రజలకు సేవ చేస్తున్న డిప్యూటి డీఎమ్ఎచ్వో రాజగోపాల రావు, కీర్తన, సురెందర్,మణీదిప్, అర్జున్ ప్రభుత్వ వైద్యులను సన్మానించడం చాలా అభినందనీయమని,వారు చేస్తున్న సేవలను రక్తదానం ఉచిత కంటి శిబిరాలు పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ పేద విద్యార్థులకు ఎక్కడైతే అవసరార్థులు ఉంటారో వారిని గుర్తించి వారికి సేవ చేయడం పరమావధిగా పెట్టుకొని పనిచేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి ని అభినందించారు. అనంతరం పోస్టల్ వర్కర్స్ డే సందర్భంగా చొప్పదండిలోని పోస్ట్ ఆఫీస్ లో పనిచేస్తున్న పోస్టల్ సిబ్బందిని సన్మానించి వారి సేవలను అభినందించడం జరిగింది.ఈరోజు చార్టెడ్ అకౌంటెంట్ డే సందర్భంగా చొప్పదండిలోని చార్టెడ్ అకౌంటెంట్ కట్ల అరుణ్ ను సన్మానించి వారికి ప్రోత్సాహం అందించారు.అలాగే జులై ఒకటవ తేదీ బుధవారం రోజు లయన్స్టిక్ ఇయర్ ప్రారంభోత్సవం సందర్భంగా చొప్పదండి క్లబ్ లోని సభ్యులు రెండు కార్యక్రమాలు చొప్పున 51 కార్యక్రమాలు చేశారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు వల్లాల జగన్ క్లబ్ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వల్లాల జగన్, కార్యదర్శి దూస రాము, కోశాధికారి సిరిపురం రాజు డిస్టిక్ క్యాబినెట్ సెక్రటరీ వల్లాల కృష్ణ హరి, డిస్టిక్ క్యాబినెట్ ట్రెజరర్ కొల్లూరి ఆనందం, డిస్టిక్ క్యాబినెట్ జైంట్ సెక్రెటరీ మహేశుని మల్లేశం డిస్టిక్ జాయింట్ ట్రెజరర్ కొల్లూరి జితేందర్ మరియు మైక్రో క్యాబినెట్ సభ్యులు చింతల రవి, తొడుపునూరి లక్ష్మయ్య, తొడుపునూరి సత్యనారాయణ, నలుమాచు సుధాకర్, రాజేష్ పవర్, గొల్లపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు


## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



చొప్పదండి/ కరీంనగర్, జులై 01 (అక్షరం న్యూస్ )
మండలం లోని గుమ్లాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు గ్రామానికి చెందిన పెరుమాండ్ల. మనోజ్ కుమార్ గత సంవత్సరం లో మరణించగా బుధవారం రోజు పెరుమాండ్ల మనోజ్ కుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా తన జ్ఞాపకార్థంగా తన సోదరుడు పెరుమాండ్ల అనిల్ కుమార్ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు . ఇట్టి కార్యక్రమంలో పెరుమాండ్ల. మనోజ్ కుమార్ సోదరుడు పెరుమాండ్ల అనిల్ కుమార్ , వారి కుటుంబ సభ్యులు, తన మిత్రులు , మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. విద్యార్థిని విద్యార్థులకు బ్యాగులు అందజేశారు.ఈ కార్యక్రమం లో బీసవేణి రాజశేఖర్, పెరుమాండ్ల మహేష్, పెరుమాండ్ల రాములు,పెరుమాండ్ల పరుశరాములు, కైరి అజయ్, పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరిన లింగాల ఘనపూర్

## బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు సంపత్, జీడికల్ సర్పంచ్ మమత






జనగామ జిల్లా/ రఘునాథపల్లి /( అక్షరం న్యూస్) జులై 01:
స్టేషన్ ఘనపూర్ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు,మాజీ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, లింగాల ఘనపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొల్లూరి శివ కుమార్ ల ఆధ్వర్యంలో లింగాల ఘనపూర్ బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కొండబోయిన సంపత్, జీడికల్ గ్రామ సర్పంచ్ కొండబోయిన మామత, వార్డు మెంబర్ మొల వెంకట్ రెడ్డి తో పాటు మరో 30మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కడియం శ్రీహరికాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షతులై కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక నిధులతో నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అందరం కలిసి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలనీ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్' కష్టాలు..అర్థమైతేలేదు.. 'సర్ '!



- **పారాలు నింపడంలో ఓటర్ల అవస్థలు**

రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జులై -01(అక్షరం న్యూస్ )
కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎన్యూమరేషన్ ఫారాల భర్తీ ఓటర్లకు సవాల్‌గా మారింది. ముఖ్యంగా 2002 నాటి ఓటరు జాబితా వివరాలను తప్పని సరిగా నమోదు చేయాల్సి రావడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఎన్యూమరేషన్



పారాలను పూరించడం ఓటర్లకు ఇబ్బందికరంగా మారింది. క్యూ ఆర్ కోడ్ తో ముద్రితమైన ఈ పత్రం లో చిన్న తప్పు చేసిన ఓటు విషయం లో గంధరగోళం నెలకొనే పరిస్థితి నెలకొంది. అందుకని వాటిని నింపడానికి ఓటర్లు ఇతరుల పై ఆధార పడవలసి వస్తుంది. చదువు కున్న వారు కూడా అందులోని వివరాలు రాయడానికి తట పటాయించాల్సిన దుస్థితి అన్ని గ్రామాలు పట్టణంలో కనిపిస్తుంది.

### బీఎల్‌వోలకూ తిప్పలు..

ఎస్ఐఆర్‌పై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో బీఎల్‌వోలు ఇబ్బందులు పడుతున్నారు. 2002 జాబితాలో పేరు లేకపోతే మా ఓటు పోతుందా, ఇప్పుడు ఓటు ఉంటే సరిపోదా? వంటి ప్రశ్నలను ఓటర్లు అడుగుతుండడంతో వారికి సమాధానాలు చెప్పడానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోంది. చదువుకున్న వారు సైతం ఫారాలు పూర్తి చేయడానికి పలుమార్లు ఇతరుల సహాయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేయించేందుకు ఒక్కో ఇంటి వద్ద గంటకు పైగా సమయం పడుతోంది. దీంతో మిగిలిన ఇళ్లకు ఫారాలు పంపిణీ చేయడం బీఎల్‌వోలకు భారంగా మారింది. ఒక్కో బీఎల్‌వో 1200 మంది ఓటర్లకు ఫారాలు అందజేసి, తిరిగి కలెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో కొంతమేర స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం లభిస్తున్నప్పటికీ గ్రామాలలో పట్టణాలలో మాత్రం బీఎల్‌వోలు ఒంటరిగానే పని చేస్తున్నారు

### 2002 ఓటరు జాబితా కోసం వెతుకులాట..

ఎస్ఐఆర్‌లో మొదటి కాలమ్‌లోనే 2002 నాటి ఓటరు వివరాలు నమోదు చేయాలని ఎన్నికల సంఘం సూచించడంతో సమస్య మరింత జఠిలమైంది. ప్రస్తుతం ఓటరు జాబితాలో పేరు ఉన్నప్పటికీ, 2002లో తమ పేరు ఉందా, లేదా అనే విషయాన్ని తెలుసుకోవడానికి సాధారణ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బీఎల్‌వోల వద్ద ఒక పీడీఎఫ్ రూపంలో మాత్రమే పాత జాబితా ఉండటంతో మొబైల్‌లో చూసి వివరాలు చెబుతున్నారు. అయితే స్మార్ట్ ఫోన్ వినియోగం తెలియని వారు, నిరక్షరాస్యులు, వృద్ధులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన కూడా ఓటర్ల సమస్యలను పెంచుతోంది. అప్పట్లో ఒక నియోజకవర్గంలో ఉన్న



గ్రామాలు ప్రస్తుతం వేరే నియోజకవర్గాల్లో ఉండటంతో 2002 వివరాలను గుర్తిం చడం కష్టమవుతోంది. దీంతో ఫారాల భర్తీ ఆలస్యమవుతోంది. ఫారాలు అందుకున్న ఓటర్లు వాటిలో వివరాలను సక్రమంగా భర్తీ చేయకపోతే ఓటు హక్కు ఉంటుందా, పోతుందా అని ఆందోళన చెందుతున్నారు.

### కొరవడిన స్పష్టత...

ఇప్పటికే పలుమార్లు పోలింగ్ బూత్ స్థాయి అధికారులు( బిఎల్‌ఓ) (సార్) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు సంబంధించి సమగ్ర శిక్షణ తీసుకున్నారు అయినప్పటికీ ఇంకా క్షేత్రస్థాయిలో ఓటర్లు అడిగే వాళ్ళ సందేహాలు నివృత్తి చేసేందుకు వారు ఉన్నత అధికారులపై ఆధారపడుతున్నారు. ఓటర్లు అడిగే ప్రశ్నలకు బిఎల్‌ఓ లు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ సఖి ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు







మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూలై 01/ అక్షరం న్యూస్ –:
లయన్స్ నూతన సంవత్సర ప్రారంభ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల్ సఖి సభ్యులు వివిధ కార్యక్రమాలను చేపట్టారు. బుధవారం డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల్ సఖి ప్రెసిడెంట్ నాగుల రూప, సెక్రటరీ బాలేశ్వరి, ట్రెజరర్ జ్యోతి, డాక్టర్ నీమీల ఈ ఎన్ టి, డాక్టర్ సింథే శైలేంద్ర కుమార్ చెస్ట్ డాక్టర్లను సన్మానించారు. పోస్టల్ డే మరియు చార్టెడ్ అకౌంట్ డే సందర్భంగా పోస్ట్ మ్యాన్స్ బాబన్న, చక్రపాణి మరియు చార్టెడ్ అకౌంట్ సాయికుమార్ లని సన్మానించారు. అంతేగాక సఖి క్లబ్ అడ్మినిస్ట్రేటర్ బండ శాంకరి జడ్.పి.హెచ్.ఎస్ ముత్యంపల్లి పాఠశాలలో స్కావెంజర్ గా పని చేస్తున్న భూమమ్మ దంపతులకు ఎనిమిది వేల రూపాయలు వారి ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సాయం చేశారు. అలాగే బుచ్చమ్మ కు రెండు వేల రూపాయల సరుకులను అందజేశారు. సెక్రెటరీ బాలేశ్వరి 50 మందికి షుగర్ మరియు బిపి టెస్ట్ లు చేశారు. లయన్ సభ్యులు ఇడుగురాళ్ల పద్మజ, సుంకరి లక్ష్మి, సుమన చైతన్య విద్యార్థులకు వర్షాకాలంలో వచ్చే వ్యాధులు పాము కాటు ప్రథమ చికిత్స, పాఠశాల సంసిద్ధత, క్యాన్సర్ వ్యాధులపై అవగాహన తరగతులు నిర్వహించారు. కట్ల భాగ్యలక్ష్మి పేదలకు 50 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతేకాకుండా విత్తనాల సేకరణ, పండ్ల పంపిణీ, మొక్కలు నాటడం, వస్త్ర దానం,ఇలా ఒకే రోజు 18 కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖి ప్రెసిడెంట్ మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని తెలియజేశారు. తమ వంతు సహాయం అందించడంలో సఖి సభ్యులు ఎప్పుడూ ముందు ఉంటారని తెలియజేశారు. రాబోవు రోజులలో కాన్సర్ పై అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని, స్టీల్ గ్లాస్ – ప్లేటు ఉద్యమాన్ని లేవ నెత్తుతామని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాటన్ సంచులను పంపిణీ చేస్తామని, విరివిగా మొక్కలు నాటుతామని, పేదవారికి ఉచిత దయాబెటిక్ క్యాంప్స్ మరియు ఐ క్యాంప్స్ నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ ఒంటెల కరుణ,బోర్డు మెంబర్స్ గజ్జల శోభారాణి, గుండ్ల జ్యోతి, రజిత, సుకన్య, రమ పాల్గొన్నారు.

## వీబీ-జీ-రామ్-జీ పథకానికి నేడు శ్రీకారం

- తిరుపతి జిల్లాలో ప్రారంభించనున్న మంత్రులు
- ముఖ్య అతిథులుగా సిఎంబ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాక

తిరుపతి,జూలై1 రాష్ట్రంలో మాత్రం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జూలై 2వ తేదీన పథకాన్ని తిరుపతిలో ప్రారంభించనున్నారు. అదేరోజు జిల్లాలో కొత్త పథకం అమలులోకి రానుంది.మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం.. బుధవారం నుంచి 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, అజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీ-జీ-రామ్-జీ)'గా మారింది. వలసలకు అడ్డుకట్ట వేస్తూ 2006లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణులకు పనులు కల్పిస్తూ తీసుకొచ్చిన ఎంజీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ మంగళవారంతో ముగిసింది. బుధవారం నుంచి వీబీ-జీ-రామ్-జీ అమల్లోకి వస్తున్నా.. గురువారం తిరుపతి జిల్లాలోని ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె పంచాయతీ మంగంపేటలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, కమలేష్ పశ్వాన్, పెమ్మసాని చంద్రశేఖర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాగా, ప్రతి మండలం లోనూ ఒక పంచాయతీలో.. వీబీ-జీ-రామ్-జీ పథకాన్ని బుధవారం నుంచి అమలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)ద్వారా కొత్త పథకాన్ని కొనసాగించనున్నారు. ఇందుకోసం డ్వామా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కాగా, ఇప్పటి వరకు కూలీలకు తప్పనిసరిగా వంద రోజుల ఉపాధి పనులు కల్పిస్తున్నారు. వీబీ-జీ-రామ్-జీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉండి ఉపాధి పనులకు వచ్చే ప్రతి కుటుంబానికి ఏటా 125 పనిదినాలు కల్పిస్తారు. రెండు వారాలకు ఒకసారి ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లిస్తారు. ఒకవేళ చెల్లింపుల్లో జాప్యం జరిగితే, ప్రత్యేక పరిహారం చెల్లిస్తారు. ఆరు నెలలకు ఒక సారి సామాజిక తనిఖీలు నిర్వహిస్తారు. క్షేత్ర స్థాయిలోని లోపాలు ఎప్పటికప్పుడు సవరించడానికి కూలీల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, త్వరతగతిన పరిష్కారం చేపట్టనున్నారు. పశువుల కొట్టాలు, కంపోస్టు పిట్స్, అమృత్/మినీ అమృత్ సరోవర్లు, పశువులకు చెరువులు, పూడికతీత, పునరుద్ధరణ, చెక్‌డ్యాంల పూడికతీత, ఫీడర్లు, ఫీల్డ్ ఛానెళ్లు, తవ్విన చెరువులు, చేపల చెరువులు, పశుమేత అభివృద్ధి, ఇంకుడు కుంటలు, మేజిక్ కాలువలు, రీ బుష్ ఎ÷-లాంటేషన్, కొత్త చెక్ డ్యాంలు, ఎ÷-లాంటేషన్, నర్సరీలు, సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, బీటీ రోడ్లు, ట్రెంచ్‌లు తదితర పనులు చేపట్టనున్నారు. ఈ పనులను చూస్తుంటే.. రైతులకు పాక్షికంగా మేలు చేసేలా ఉంది. నూతన సంస్కరణలతో వ్యవసాయరంగానికి, రైతాంగానికి పూర్తిగా ప్రయోజనం చేకూరనుంది.

## రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగివున్న ట్రక్కును ఢీకొన్న బస్సు
- మంటలు చెలరేగడంతో ఏడుగురు సజీవ దహనం

దౌసా,జూలై1 : రాజస్థాన్‌లో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. దౌసా జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు, నిలిపి ఉంచిన ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే వాహనాల్లో మంటలు చెలరేగడంతో ఘటనా స్థలంలోనే ఏడుగురు ప్రయాణికులు సజీవదహనమయ్యారు. స్థానిక సమాచారం ప్రకారం.. బస్సు వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న ట్రక్కును వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు క్షణాల వ్యవధిలోనే బస్సులో భారీగా మంటలు వ్యాపించాయి. ప్రయాణికులు నిద్రమత్తులో ఉండటంతో ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే మంటలు బస్సు మొత్తాన్ని చుట్టుముట్టాయి. ఏడుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. 22 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో ఈ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ÷ర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి అతివేగమే కారణమా లేక డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్ల జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## టూవీలర్‌ను ఢీకొన్న కాలేజీ బస్సు

**మహిళ అక్కడిక్కడే మృతి**

హైదరాబాద్,జూలై1: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జాతీయ రహదారిపై బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళను ఓ కాలేజీ బస్సు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపగా, జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్‌కు కారణమైంది. ఈ ఘటనపై సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి హైవేపై వెళున్న ద్విచక్ర వాహనాన్ని కాలేజీ బస్సు ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతతో మహిళ బస్సు కింద పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ప్రమాద సమయంలో రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి రాకపోకలను క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేశారు. కొంతసేపు ఆ మార్గంలో తీవ్ర ట్రాఫిక్ జామ్ నెలకొనడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

## మణికొండలో ఈగిల్ టీమ్ దాడులు

**హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్న వక్తి పట్టివేత**

హైదరాబాద్,జూలై1: హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మణికొండలో 'ఈగల్ టీమ్' బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో భాగంగా ఓ ప్రైవేట్ హోటల్‌లో బస చేసిన వ్యక్తిని హ్యాష్ ఆయిల్ విక్రయిస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు మణికొండ పరిధిలోని సదరు ప్రైవేట్ హోటల్‌పై ఈగల్ టీమ్ సభ్యులు ఒక్కసారిగా మెరుపు దాడులు చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. నిందితుడి నుంచి 9 గ్రాముల లిక్విడ్ హ్యాష్ ఆయిల్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితుడితో పాటు సీజ్ చేసిన హ్యాష్ ఆయిల్‌ను స్థానిక నార్సింగి పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ వ్యక్తి డ్రగ్స్ విక్రేతా? లేక ఏజెంటా? అనే కోణంలో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హ్యాష్ ఆయిల్ ఎక్కడి నుంచి నగరానికి తీసుకొచ్చారు? దీని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు ఐటీ కారిడార్‌లోని ఎవరెవరికి దీనిని సరఫరా చేస్తున్నారనే అంశాలపై నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు. నగరంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిఘా మరింత కఠినతరం చేసినట్లు అధికారులు తెలిపారు.

# ఉపాధి లక్ష్యం మారితేనే గ్రామాలకు మహర్దశ !



హైదరాబాద్,జూలై1 ఉపాధి హామీ పథకం పేరు మారింది. నింబంధనలు మార్చిన కేంద్రం ప్రభుత్వం వీబీజీరామ్‌జీ అంటే వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తీసుకుని వచ్చింది. పథకం పేరు మారినా పెద్దగా మారిందేమీ ఉండకపోవచ్చు. ఇందులో గతంలో కేంద్రం 90శాతం నిధులు, రాష్ట్రాలు పదిశాతం నిధులు భరించేవి. కానీ ఇప్పుడు కేంద్రం 60శాతం, రాష్ట్రాలు 40శాతం నిధులు భరించేలా మార్పులు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి ఉపాధి కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2006లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టుంది. కూలీలకు ఉపాధి కల్పించే పథకంగా పేరు సంతరించుకున్న ఉపాధి హామీ పథకం ఇక వీబీజీరామ్‌జీ పేరుతో జులై1 నుంచి అమలు చేయనున్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను సమకూర్చేవి. వీబీజీరామ్‌జీకి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించనున్నాయి. ఈలెక్కన రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం అదనంగా నిధులు భరించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకం అమలుతో వలసలు తగ్గడంతో పాటు,గ్రామీణప్రాంత ప్రజలకు ఎంతోకొంత ప్రయోజనకరంగా మారింది. వీబీజీరామ్‌జీతో ఉపాధి కూలీలకు మేలు చేకూరనుంది. పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచారు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే, వేలకోట్లు ఖర్చు చేసినా గ్రామాల్లో పెద్దగా మార్పులు కానరాలేదు. ఈ పథకం పేరు మార్చిన పెద్దలు విధానలను పట్టించుకున్నట్లుగా లేదు. గ్రామాల్లో ఇప్పుడు వ్యవసాయ కూలీల కొరవ ఉంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు వెనక్కి పోయాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. చెరువులు కుంటలు మాయం అవుతున్నాయి. పచ్చదనం పగటికలగా మారింది. పర్యావరణ విధ్వంసం యధావిధిగా సాగుతోంది. చెరువుల పునరుద్దరణ సాగాలి. నాలాల పూడికతీతలు చేయాలి. వాననీటి సంరక్షణ పథకాలు చేపట్టాలి. ఈ క్రమంలో వీటన్నింటిని ఇందులో చేర్చి పక్కాగా కొత్త పథకం ద్వారా దేశ నిర్మాణం చేయగలగాలి. అప్పుడే వెచ్చించిన డబ్బులకు ప్రతిఫలం దక్కుతుంది. కేవలం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఏదో ఒక పనిచేయించామన్న రీతిలో పథకం సాగరాదు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు వేతనాలు ఆలస్యమయ్యేవి. ఒక్కోసారి నెలలు గడిచినా డబ్బులు జమయ్యేవి కావు. నూతన పథకంలో వేతనాలు ఆలస్యమైతే కూలీలకు పరిహారం చెల్లించనున్నారు. పనిచేసిన తరువాత 15 రోజుల్లో కూలీల బ్యాంకు ఖాతాల్లో వేతనం జమ చేయనున్నారు. అలస్యమైతే పరిహారం ఇవ్వనున్నారు. గతంలో కాకుండా ప్రతి కుటుంబానికి 125 రోజులు పని దినాలు కల్పించనున్నారు. వీబీజీరామ్‌జీ పథకాన్ని మూడుగా విభజించారు. పనుల్లో పారదర్శకత పెంచడడంతోపాటు అరు నెలలకోసారి సామాజిక తనిఖీలు చేయనున్నారు. వేతనాల చెల్లింపు వివరాలను బహిరంగంగా వెల్లడించనున్నారు. ఫిర్యాదుల స్వీకరణకు సరికొత్త వ్యవస్థలను వినియోగంలోకి తీసుకురానున్నారు. కొత్త పథకంపై తెలంగాణ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇటీవల కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో జరిగిన భేటీలో మంత్రి సీతక్క తమ అభ్యంతరాలను తెలియచేసింది. కేంద్రం కూడా రాష్ట్రాల అభ్యంతరాలతో పాటు, పనుల నిర్వహణపై సూచనలు సలహాలు తీసుకుని ఉంటే బాగుంటుంది. ఎందుకంటే చేపట్టే పనులు గ్రామాల ఆర్థిక పరిస్థితిని మార్చగలిగేలా ఉండాలి. గ్రామాల్లో చెరువుల పూడికతీత, భవనాల నిర్మాణం, కాలువల నిర్మాణం, మొక్కల పెంపకం, కొతుల నిర్మూలన వంటి పనులన్నీ ఇందులోకి తీసుకుని రాగలిగితే మంచిది. ఇకపోతే వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ కొత్త ఉపాధి పథకంలో అయినా ఈ సమస్యకు పరిష్కారం చూపగలగాలి. ఎల్‌నినో ప్రభావంతో ఈ యేడు వర్షాలు అంతంతమాత్రంగానే ఉండనున్నాయి.

ఈసారి అనేక ప్రాంతాల్లో నైరుతి వర్షించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై తీవ్ర ప్రభావం ఉండబోతోంది. దీంతో దేశవ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్యమవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో ఉపాధి పనులతో సమస్యలను ఎదుర్కొనేందుకు ఎదురీదాలి. గ్రామాల్లో నీటి వనరులను పెంచే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. మొక్కలను పెంచాలి. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనికి విరుగుడుగా ప్రధానంగా భూగర్భ జాలాలను పెంచుకోవాలి. వాననీటిని ఒడిసిపట్టాలి. ఈ పనులకు అవసరమయ్యే కూలీలను ఉపాధి పథకం ద్వారా భర్తీ చేయగలగాలి. అప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మార్గం చూపినవారం అవుతాం.

# ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు మరింత ఆలస్యం

- పెద్దగా ప్రభావం ఉండేలా కనిపించని పరిస్థితి
- వరి బదులు ఆరుతడి పంటలపై సిఎం రేవంత్ సూచనలు



హైదరాబాద్,జూలై1 నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. తాజాగా సిఎం రేవంత్ రెడ్డి కూడా ఇదే విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదని, అందువల్ల రైతులు ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలని కోరారు. వరికి అసవరమైన నీరు లభించనప్పుడు, ఆరుతడి పంటలవైపు మళ్లాలని అన్నారు. దీంతో రైతులు కూడా ఈదిశగా ఆలోచన చేయాల్సి ఉంది. అదేపనిగా వరి పండించడం వల్ల కూడా రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఈ అవకాశాన్ని ఆసారగా తీసుకుని మార్పుకోసం ప్రయత్నిస్తే మంచిదే. ఎందుకంటే వర్షాలు పడతాయో లేదో తెలియడం లేదు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో నారు వేసే పరిస్థితి లేదు. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో సిఎం ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయంగా కనిపిస్తోంది. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది.


# సాయికృష్ణ లాకప్ డెత్ కేసు

**మరో ఇద్దరు కానిస్టేబుళ్లకు 14రోజుల రిమాండ్**

విజయవాడ,జూలై1: సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో మరో ఇద్దరు పోలీసులను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. కేసులో నిందితులుగా ఉన్న కానిస్టేబుళ్లు బాబురావు, సాంబయ్యలను అదుపులోకి తీసుకున్న అధికారులు.. వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం జిల్లా కోర్టులో హాజరుపర్చారు. ఈ సందర్భంగా కోర్టుకు సిట్ అధికారులు.. రిమాండ్ రిపోర్ట్‌ను సమర్పించారు. ఇద్దరు కానిస్టేబుళ్లకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. వారిని అవనిగడ్డ జైలుకు తరలించాలంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. 'బాబురావు, సాంబయ్య సాక్ష్యాలను మాయం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్లోని సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను మార్చేశారు. వేరే హార్డ్ డిస్క్‌లను అమర్చి సాక్ష్యాలను ధ్వంసం చేశారు. సాయికృష్ణ మృతదేహం ఎక్కడుందో ఇప్పటికీ తెలియలేదు. అరెస్ట్ అయిన నిందితులు విచారణకు సహకరించడం లేదు. దర్యాప్తును పక్కదారి పట్టిస్తున్నారు. పోలీసులు కావడంతో సాక్ష్యాలను ప్రభావతం చేసే అవకాశం ఉంది' అంటూ రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ అధికారులు పేర్కొన్నారు.

# ఫ్యామిలీ డ్రామాకు తోడు క్రైమ్ థ్రిల్లర్

**ఆదర్శకుటుంబం స్టోరీపై చర్చ**




విక్టరీ వెంకటేష్ హీరోగా, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న ఆదర్శ కుటుంబంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు క్రైమ్ థ్రిల్లర్ అంశాలను జోడిస్తూ రూపొందుతున్న ఈ చిత్రం విడుదల తేదీని ఇటీవల చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. విక్టరీ వెంకటేష్ హీరోగా, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న ఆదర్శ కుటుంబంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. సినిమాలో సుదీర్ఘంగా సాగే ఓ ట్రైన్ ఎపిసోడ్‌ను ప్రత్యేకంగా రూపొందించారట. సిట్యుయేషనల్ కామెడీతో నిండిన ఈ సన్నివేశం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఇటీవలే ఈ ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయిందని, ఇందులో వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లను వినోదాత్మకంగా తెరకెక్కించడంలో త్రివిక్రమ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. మరోవైపు కామెడీ, భావోద్వేగ సన్నివేశాల్లో వెంకటేష్‌కు ఉన్న టైమింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమాను హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఇటీవల ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్లు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, ఈ సినిమాపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం 'ఆదర్శ కుటుంబం' షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం.

## టాక్సిక్ నుంచి లేడీస్ అండీస్ గ్లింప్స్ విడుదల




రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ గ్లింప్స్ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న హై-బడ్జెట్ చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఇప్పటివరకు యష్ లుక్స్, యాక్షన్‌తోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన మేకర్స్, తాజాగా ఈ చిత్రంలోని పవర్‌ఫుల్ మహిళా పాత్రలను పరిచయం చేస్తూ మరింత బోల్డ్‌గా 'లేడీస్ అండ్ లేడీస్' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ ఊహించని విధంగా అత్యంత బోల్డ్, రా అండ్ రస్టిక్ విజువల్స్‌తో సాగింది. చిత్రంలో నటిస్తున్న లేడీస్ అందరినీ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఎంతో పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేశారు. నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా, మరియు రుక్మిణి వసంత్ లతో కూడిన ఈ భారీ లేడీ కాస్టింగ్ గ్లింప్స్‌లో మునుపెన్నడూ చూడని బోల్డ్ అవతార్లలో కనిపించి షాక్ ఇచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అద్భుతమైన విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. 'డాడీ ఈజ్ హోమ్' అంటూ యష్ ఎంతటి పవర్‌ను చూపించాడో, ఈ లేడీ గ్యాంగ్ అంతకంటే ఎక్కువ 'టాక్సిక్'గా ఉండబోతోందని ఈ గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. కెవిఎన్ ప్రొడక్షన్స్ మరియు యష్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ పాన్-ఇండియా చిత్రం ఆగస్ట్ 26, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

## రావు బహదూర్‌కు మహేశ్ వాయిస్ ఓవర్

**చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసిన నిర్మాణ సంస్థ**



టాలీవుడ్ నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో, టాలెంటెడ్ డైరెక్టర్ వెంకటేష్ మహా దర్శకత్వంలో తెరకెక్కుతున్న సైకలాజికల్ డ్రామా 'రావు బహదుర్'. ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. సూపర్ స్టార్ మహేష్ బాబు సమర్పణలో జిఎమ్‌బి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమా ట్రైలర్‌కు స్వయంగా మహేష్ బాబే వాయిస్ ఓవర్ అందించడం విశేషం. నాటకానికి లాజిక్ ఉండదు అంటారు.. కానీ నాటకానికి మాయ తోడైతే లాజిక్కే మారిపోతుంది అంటూ సాగే మహేష్ బాబు గంభీరమైన వాయిస్ ఓవర్ ట్రైలర్‌కు ప్రాణం పోసింది. ఒక వ్యక్తి చనిపోవాల్సిన సమయం కంటే ఏడాది పాటు ఎక్కువ కాలం ఎలా బతికాడు? ఒక చిన్న అనుమానం ఒక మనిషి జీవితాన్ని, అతని విధిని ఎలా మార్చేసింది.. అనే ఇంట్రెస్టింగ్ పాయింట్‌తో ట్రైలర్ సరికొత్తగా సాగింది. తెలుగు సినిమాలో ఇప్పటివరకు ఎవరూ చూడని ఒక మైండ్ బ్లోయింగ్ లాంటి ఎక్స్‌పీరియన్స్‌ను ఈ చిత్రం అందించబోతోందని మహేష్ బాబు తన వాయిస్ ఓవర్ ద్వారా హామీ ఇచ్చారు.

చివరి స్టేజ్ లివర్ క్యాన్సర్‌తో మరణానికి దగ్గరై, మిరాకిల్‌గా బతికిన వ్యక్తిగా, 'రామప్ప' అలియాస్ 'రావు బహదుర్' పాత్రలో సత్యదేవ్ తన నట విశ్వరూపం చూపించారు. డార్క్ కామెడీ, సస్పెన్స్, మ్యాజికల్ రియలిజం కలబోసిన ఈ ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తోంది. స్మరణ్ సాయి అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, కార్తీక్ పర్మార్ అద్భుతమైన విజువల్స్ సినిమా రేంజ్‌ను పెంచేశాయి. ఈ చిత్రాన్ని శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎఎస్ మూవీస్ బ్యానర్లపై చింత గోపాలకృష్ణ రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వికాస్ ముప్పాళ్ల, దీపా థామస్, బాల పరాశర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

## కాగితం పడవలు బృందానికి చిరు అభినందనలు

కర్ణాటక రాష్ట్రంలోని చింతామణిలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ, కాలక్రమేణా ఒక చిత్ర నిర్మాతగా మారిన మెగా అభిమాని అంజనప్ప , 45 మంది తన స్నేహితులు, 'కాగితం పడవలు' చిత్రబృందంతో కలిసి చిరంజీవి పై ఉన్న అభిమానంతో, వందల కిలోమీటర్లు ప్రయాణించి మరీ హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేశారు. 'రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి' అని మెగాస్టార్ చిరంజీవి ఇచ్చిన పిలుపును గుండెల్లో నింపుకుని, లక్షలాది మంది ప్రాణాలను కాపాడటంలో మెగాభిమానులు ఎప్పుడూ ముందుంటారని మరోసారి వారంతా నిరూపించారు.

## ఆల్ఫా సెన్సార్ పూర్తి...3న విడుదల




శివ్ రావైల్ దర్శకత్వంలో, అలియా భట్, శర్వరి ప్రధాన పాత్రలు పోషిస్తున్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. జులై 3న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా తాజాగా సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఇప్పటికే యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సినిమాలో కొన్ని మార్పులు చేయాలని కోరింది. ద్వితీయార్థంలో వచ్చే కొన్ని సన్నివేశాల తీవ్రతను తగ్గించి, ప్రత్యామ్నాయ దృశ్యాలను పెట్టాలని సూచించింది. ప్రథమార్ధంలోని ఓ డైలాగ్‌ను తొలగించి, మరో రెండు సంఘటనల విజువల్స్‌ను తగ్గించాలని ఆదేశించింది. మద్యం తీసుకునే సన్నివేశాల్లో గమనిక వేయాలని, మూవీలోని అన్ని పాటలకూ సబ్‌టైటిల్స్ జోడించాలని కోరింది. సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ కోసం వారి తల్లిదండ్రుల నుంచి అనుమతి లేఖను సమర్పించాలని ఆదేశించింది. తాజాగా ఆల్ఫా ఈ పనులన్నీ పూర్తి చేసుకుంది. ఈ భారీ యాక్షన్ సినిమా నిడివి 2 గంటల 20 నిమిషాల 48 సెకన్లు. ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ మూవీలో బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తుండగా, హృతిక్ రోషన్ అతిథి

# టీ20ల్లో వరల్డ్ నెంబర్ 1 బ్యాటర్‌గా ఇషాన్ కిషన్..

**రెండోస్థానంతో సరిపెట్టుకున్న అభిషేక్ శర్మ**



ఇటీవలి కాలంలో టీ20ల్లో వరుసగా రాణిస్తున్న ఇషాన్ కిషన్ అరుదైన ఘనత దక్కించుకున్నాడు. అంతర్జాతీయ టీ20లలో నెంబర్ 1 బ్యాటర్‌గా నిలిచాడు. టీ20 ఇంటర్నేషనల్ టోర్నీలకు సంబంధించి బుధవారం ఐసీసీ ర్యాంకులు విడుదల చేసింది. ఈ ర్యాంకుల్లో బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ నెంబర్ 1 ర్యాంక్ కైవసం చేసుకున్నాడు.



ఇప్పటివరకు ఈ స్థానంలో కొనసాగిన ఇండియన్ ప్లేయర్ అభిషేక్ శర్మను ఇషాన్ వెనక్కి నెట్టాడు. దీంతో దాదాపు ఏడాదిపాటు నెంబర్ 1 ర్యాంకులో కొనసాగిన అభిషేక్ శర్మ ఇప్పుడు రెండో ర్యాంకుతో సరిపెట్టుకున్నాడు. పాయింట్ల టేబుల్‌లో ఇషాన్ కిషన్ 876 పాయింట్లు సాధించగా, అభిషేక్ శర్మ 869 పాయింట్లు సాధించాడు. ఇషాన్.. ఈ ఏడాది జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో సత్తా చాటాడు. 9 మ్యాచుల్లో 317 పరుగులు సాధించి ఇండియా కప్పు గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. అంతేకాదు.. ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన రెండో భారత ఆటగాడిగా నిలిచాడు. సంజూ శాంసన్ టోర్నీలో అత్యధిక పరుగులు సాధించాడు. ఇషాన్ సాధించిన విజయం అమోఘం. అతడు అంతకుముందు వరుసగా విఫలమవుతుండటంతో 2023 డిసెంబర్‌లో జాతీయ జట్టులో స్థానం కోల్పోయాడు. తర్వాత దేశీయ టోర్నీలలో సత్తా చాటాడు. ముఖ్యంగా ఝార్ఖండ్ తరఫున రంజీలలో ఆడి భారీ పరుగులు సాధించాడు.

అనంతరం 2025-26లో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో కూడా రాణించాడు. దీంతో తిరిగి జాతీయ జట్టులో అతడికి స్థానం దక్కింది. ఆ తర్వాత టీ20 వరల్డ్ కప్‌లో కూడా రాణించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. మరోవైపు ఇటీవల ఇండియాపై రెండు టీ20 మ్యాచుల్లో విజయం సాధించిన ఐర్లాండ్ ఆటగాళ్లు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్లారు. ఐర్లాండ్ కెప్టెన్ లోర్కాన్ టక్కర్ 77వ ర్యాంకు సాధించాడు. రాస్ అడైర్ 84వ ర్యాంకు సాధించాడు.

## టీమిండియా ప్లేయర్ల ఫిట్‌నెస్ పై గవాస్కర్ అనుమానం

ఉమెన్స్ టి20 వరల్డ్ కప్ 2026 లో ఇండియా జర్నీ ఆస్ట్రేలియా చేతిలో ఓటమితో ముగిసింది. లాస్ట్ గ్రూప్ మ్యాచ్ లో కచ్చితంగా గెలవాల్సిన డూ-ఆర్-డై సిట్యుయేషన్ లో బరిలోకి దిగిన ఇండియా, ఆస్ట్రేలియా ఉమెన్స్ టీమ్ చేతిలో ఓడిపోయి సెమీఫైనల్ రేస్ నుంచి అవుట్ అయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతూ మెరుపు హాఫ్ సెంచరీ చేయగా, ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ సాలిడ్ స్టార్ట్ ఇచ్చారు. దీంతో ఇండియా 170/4 భారీ స్కోర్ చేసింది. 171 రన్స్ టార్గెట్ ఛేజింగ్‌లో ఆస్ట్రేలియా క్లాసిక్ బ్యాటింగ్ చూపించింది. ఫస్ట్ 10 ఓవర్లలో ఇండియా ఆసీస్ ను 72/3 కి కంట్రోల్ చేసినా, ఆ తర్వాత ఎల్లీస్ పెర్రీ, యాష్లే గార్డనర్ ల మధ్య వచ్చిన 100 రన్స్ పార్ట్‌నర్‌షిప్ మ్యాచ్ ను ఇండియా నుంచి లాగేసుకుంది. ఇండియా మెన్స్ టీమ్ ఐర్లాండ్ చేతిలో ఓడిన రోజే ఉమెన్స్ టీమ్ కూడా ఓడిపోవడం ఫ్యాన్స్ ను బాగా అప్‌సెట్ చేసింది. ఈ ఓటమిపై ఇండియన్ క్రికెట్ లెజెండ్ సునీల్ గవాస్కర్ చాలా ఘాటుగా స్పందించాడు. ఆస్ట్రేలియా చేతిలో ఇండియా ఓడిపోవడం తనకు పెద్ద సర్ప్రైజ్ ఏమీ అనిపించలేదని చెప్పాడు. నిజానికి సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్ లోనే ఇండియా టోర్నీ నుంచి వర్చువల్ గా అవుట్ అయిందని గవాస్కర్ విశ్లేషించాడు. "సౌతాఫ్రికాపై ఇండియా కచ్చితంగా గెలవాల్సింది. కానీ ఆ మ్యాచ్ లో మన వాళ్లు చేసిన వరస్ట్ ఫీల్డింగ్ వల్లే చేతిలో ఉన్న మ్యాచ్ పోయింది. మంచి పొజిషన్ నుంచి మ్యాచ్ ను చేజార్చుకుని టోర్నమెంట్ లో సెమీస్ ఆశలను అప్పుడే దెబ్బతీసుకున్నారు" అని గవాస్కర్ ఓపెన్ గా చెప్పాడు. ఇదే కాకుండా ఇండియా ప్లేయర్ల ఫిట్‌నెస్ లెవెల్స్ పై గవాస్కర్ పెద్ద డౌట్ ఎక్స్ ప్రెస్ చేశాడు. మ్యాచ్ లో ఆడిన ప్లేయర్లు అందరూ వంద శాతం ఫిట్ గా ఉన్నారా లేదా అనే క్వశ్చన్ ప్రతి క్రికెట్ లవర్ మైండ్ లో రన్ అవుతోందని చెప్పాడు. "ఫుల్ ఫిట్‌నెస్ లేని ప్లేయర్ ఒకవేళ మ్యాచ్ ను ఒంటిచేత్తో గెలిపించగల ఇంపాక్ట్ ప్లేయర్ అయితే ఆడించడం ఓకే. లేదంటే బెంచ్ పై ఉన్న రిజర్వ్ ప్లేయర్లు ఇంజ్యూరీ అయిన ప్లేయర్ ప్లేస్ ను రీప్లేస్ చేసేంత క్వాలిటీతో లేరని ఒప్పుకోవాలి. ప్లేయర్లు చేతి వేళ్లకు బ్యాండేజ్ లు వేసుకుని ఆడటం చూస్తే వారు మైనర్ ఇంజరీస్ క్యారీ చేస్తున్నారనే ఇంప్రెషన్ కలుగుతోంది. నా అంచనా తప్పవ్వాలని కోరుకుంటున్నా" అని గవాస్కర్ స్పష్టం చేశాడు. ఫీల్డింగ్ ప్లేస్‌మెంట్స్ లో జరిగిన లోపాలను కూడా గవాస్కర్ క్లియర్ గా పాయింట్ అవుట్ చేశాడు. వన్డే వరల్డ్ కప్ విక్టరీ టైమ్ నుంచి ప్రత్యర్థి బ్యాటర్లు ఇండియన్ స్పిన్నర్ల బౌలింగ్ లో ఎక్స్‌ట్రా కవర్ మీదుగా చాలా ఈజీగా రన్స్ కొడుతున్నారని గుర్తు చేశాడు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609